CHANDU RK NEWS

Yuvatharam Telugu Daily

RNI APTEL/2023/88231

యువతరం

ఎడిటర్ : ఆర్. చంద్రశేఖర్ రావు

The Voice of youth

Postal Regd.No. KNL/3-77(D)/2025-2027

తెలుగు దినపత్రిక

సంపుటి : 02 సంచిక : 282 , పేజీలు : 08, వెల రూ. 4 రూ/ సోమవారం 28 - 04 - 2025

విలేఖరులు కావలెను

రెండు తెలుగు రాష్ట్రాలలో నూతనంగా ప్రారంభించిన యువతరం తెలుగు దినపత్రిక లో పనిచేయడానికి జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గ ప్రతినిధులు, మండల స్థాయి విలేఖరులు కావలెను.

సంప్రదించవలసిన నెంబర్

9989924749
7013007309

ఉగ్రవాదులు వెన్నులో వణుకు పుట్టించాలి

- దేశ చరిత్రలో నిలిచే విధంగా బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ ఉంటుందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.
- తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ నుండి 50 వేల మంది బహిరంగ సభకు తరలిస్తున్నట్లు తెలిపారు.

దేశ చరిత్రలో నిలిచే విధంగా బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ ఉంటుందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టం చేశారు. మిగతా 2లో

పాకిస్తాన్ మూల్యం చెల్లించుకోవాల్సిన రోజు దగ్గర్లోనే ఉంది

- జమ్మూ కాశ్మీర్ ఉగ్రవాద దాడి ఒక నీచమైన చర్య అని టెర్రరిజాన్ని అంతం చేస్తామన్న ప్రధాని మోడీ మాటలకు ప్రజలందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందని పాకిస్తాన్ మూల్యం చెల్లించుకోవాల్సిన రోజు ఎంతో దూరంలో లేదని మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు మిగతా 2లో

దారితప్పిన వైద్యులపై చర్యలు

ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశం

ఏసీబీ ప్రాథమిక విచారణలో ఆరోపణలు నిర్ధారణ

దారితప్పి వ్యవహరించారని ఆరోపణలొచ్చిన ఆరుగురు ప్రభు త్వ వైద్యులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

విధులకు హాజరు కాకుండా వచ్చినట్లు రిజిస్టర్లలో సంతకం చేయడం, లంచాలు తీసుకుని వైకల్య ధ్రువపత్రాలు జారీ చేయడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని పలువురు వై ద్యులపై ఆరోపణలొచ్చాయి.

అమరావతి : దారితప్పి వ్యవహరించారని ఆరోపణలొచ్చిన ఆరుగురు ప్రభు త్వ వైద్యులపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని మిగతా 2లో

తాకట్టులో ఖజానా

అప్పుల కోసం రాష్ట్ర ఖనిజ సంపద తాకట్టు..

ఏపీఎండీసీ గనులు, భవిష్యత్తు ఆదాయాలు మొత్తం తనఖా

ఎన్‌సీడీ బాండ్ల ద్వారా సమీకరించనున్న రూ.9,000 కోట్ల కోసం కేటాయింపు

బాండ్ల రూపంలో ఈ మొత్తం సేకరణలో భారీ అవకతవకలు

ప్రైవేట్ వ్యక్తులు నేరుగా ట్రెజరీ నుంచి డబ్బు తీసుకునేలా దారుణ నిర్ణయం

అమరావతి: దేశంలో ఎప్పుడూ జరగని విధంగా కూటమి ప్రభుత్వం మిగతా 2లో

పహల్గాం ఉగ్రదాడి ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు విచ్చేసిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినదించారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా నిర్మూలించాలన్నారు.

పార్టీలకు అతీతంగా పనిచేస్తూ తీవ్రవాదాన్ని అంతం చేయాలన్నారు.

ప్రధాని మోడీకి సంపూర్ణ

మద్దతు ఇస్తున్నా

పీవోకేను భారత్‌లో కలపాలి..

కలిసికట్టుగా ఉగ్రవాదంపై పోరాడాలన్న ముఖ్యమంత్రి

పాక్‌కు బుద్ధి చెప్పాలన్న రేవంత్ రెడ్డి

అభివృద్ధి పథంలో నడుస్తున్న దేశంపై దాడి చేశారని ఆగ్రహం



హైదరాబాద్: పహల్గాం ఉగ్రదాడి ని నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, మిగతా 2లో

తెలంగాణ ప్రజలను నిండా ముంచి హైదరాబాద్‌కు

వస్తున్న మీకు సుస్వాగతం

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సెటైర్లు వేశారు. దారితప్పి తెలంగాణకు వస్తున్న ఎన్నికల గాంధీ గారికి స్వాగతం అని వ్యంగ్యంగా అన్నారు. అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను నిండా ముంచేసి హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీకి సుస్వాగతం అని విమర్శించారు.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సెటైరు వేశారు. దారితప్పి తెలంగాణకు వస్తున్న ఎన్నికల గాంధీ గారికి స్వాగతం అని వ్యంగ్యంగా అన్నారు. మోసపూరిత హామీలు.. అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను నిండా ముంచేసి హైదరాబాద్‌కు మిగతా 2లో

క్రూరమైన నేరాన్ని సమర్థించలేం

ఉగ్రదాడి తర్వాత.. పాకిస్థాన్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న రష్యా!

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ దాడి తర్వాత రష్యా, పాకిస్థాన్ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. పాకిస్తాన్‌లోని రష్యన్ రాయబార కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మిగతా 2లో

పహల్గాం దాడి చెత్త పని.. పరిష్కారం భారత్-పాక్ చేతుల్లోనే

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఖండించారు.

న్యూయార్క్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఖండించారు. ఈసందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, పాక్‌ల మధ్య కశ్మీర్ విషయంలో చాలా ఏళ్లుగా గొడవ జరుగుతోందన్నారు. అయితే, దాన్ని ఆ రెండు దేశాలే పరిష్కరించుకుంటాయని తెలిపారు. మిగతా 2లో

అప్పటిలా కాదు... ఇప్పుడు ప్రతి గ్రామంలో

మనం ఉన్నాం

పోలీసు కేసులు ప్రజాదరణను దూరం చేయలేవు!

గతంలో తనను 16 నెలుల జైల్లో ఉంచారని వెల్లడి

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు నమోదు చేసినా, ఇబ్బందులకు గురి చేసినా తాను కానీ, పార్టీ శ్రేణులు కానీ భయపడే ప్రసక్తి లేదని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన ఈ

క్రూరమైన నేరాన్ని సమర్థించలేం

రష్యన్ పౌరులు పాకిస్థాన్‌కు రావొద్దంటూ కోరింది. పహల్గామ్ ఉగ్రవాద దాడి నేపథ్యంలో ఈ ప్రకటన జారీ చేసింది. "పాకిస్తాన్-భారత్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రష్యన్ పౌరులు తాత్కాలికంగా పాకిస్తాన్‌ను సందర్శించకుండా ఉండాలని మేం సిఫార్సు చేస్తున్నాం." అంటూ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.అంతకుముందు, పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అధ్యక్షుడు ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీకి సంతాప సందేశాన్ని పంపారు. ఉగ్రవాదపు అన్ని రూపాలు, వ్యక్తీకరణలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భారత్‌తో పరస్పర చర్యను మరింత వేగవంతం చేయడానికి సంసిద్ధంగా ఉన్నామంటూ పుతిన్ పేర్కొన్నారు. అలాగే పహల్గామ్‌లో జరిగిన క్రూరమైన నేరాన్ని సమర్థించలేం. దాడికి పాల్పడిన వారు తగిన శిక్షను పొందుతారని మేం విశ్వసిస్తున్నాం అని అన్నారు.మరోవైపు పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత భారత్, పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికే భారత్, పాక్‌పై అనేక చర్యలు తీసుకుంది. పాకిస్తాన్ దేశస్థులకు సార్క్ వీసాలను నిలిపివేసింది, అటారీ బార్డర్ వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ (%×జూ%)ను మూసివేసింది. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్లు కూడా ప్రకటించింది. అలాగే పాకిస్తాన్ తన గగనతలాన్ని అన్ని భారతీయ విమానయాన సంస్థలకు అడ్డుకోవడం ద్వారా ప్రతిస్పందించింది. వాఘా సరిహద్దును కూడా మూసివేసి, భారతదేశంతో అన్ని వాణిజ్యాలను నిలిపివేసింది. మరో ముఖ్యమైన నిర్ణయం సిమ్లా ఒప్పందాన్ని నిలిపివేసింది.

పహల్గాం దాడి చెత్త పని.. పరిష్కారం భారత్-పాక్ చేతుల్లోనే

రోమ్ పర్యటనకు బయల్దేరిన ట్రంప్ ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడారు. ఈసందర్భంగా భారత్-పాక్ ఉద్రిక్తతలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. "ఆ రెండు దేశాలు నాకు చాలా దగ్గర. కశ్మీర్ విషయంలో భారత్, పాక్‌ల మధ్య చాలా ఏళ్లుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఇక, తాజాగా పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి చెత్త పని. ముష్కరుల దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం విచారకరం. అయితే, ఏళ్లుగా నలుగుతున్న సరిహద్దు ఉద్రిక్తతలను ఆ రెండు దేశాలే పరిష్కరించుకుంటాయి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.ఏప్రిల్ 22న పహల్గాం సమీపంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్ లోయలో ఉగ్రవాదులు నరమేధానికి పాల్పడిన సంగతి తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చినవారు పర్యాటకులను చుట్టుముట్టి అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. లష్కరే తోయిబా అనుబంధ సంస్థ అయిన 'ది రెసిస్టెంట్ ఫోర్స్' ఈ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య ఉద్రికత్తలు భగ్గుమన్నాయి.

ఉగ్రవాదులు వెన్నులో వణుకు పుట్టించాలి

తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.గ్రేటర్ హైదరాబాద్ నుండి 50 వేల మంది బహిరంగ సభకు తరలిస్తున్నట్లు తెలిపారు. సభ తర్వాత రాజకీయ ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. స్వయంపాలన కోసం బీఆర్ఎస్ పోరాటం చేసిందని.. దేశంలో ఉన్న రాజకీయ పార్టీలను ఒప్పించి కేసీఆర్ తెలంగాణ సాధించారని చెప్పారుకేసీఆర్ ఆమరణ దీక్షతోనే చిదంబరం ప్రకటన వచ్చిందని తెలిపారు. సీఎం అయ్యాక ఎవరూ ఊహించని రీతిలో కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. త్వరలో బీఆర్ఎస్ మెంబర్‌షిప్ కార్యక్రమం, కమిటీల నియామకం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదుల దాడిని సీరియస్‌గా తీసుకోవాలని.. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశం గురించి ఆలోచించాలంటే ఉగ్రవాదులు భయపడాలని అన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాల్గొన్నారు.

పాకిస్తాన్ మూల్యం చెల్లించుకోవాల్సిన రోజు దగ్గర్లోనే ఉంది

జమ్మూ కాశ్మీర్ ఉగ్రవాద దాడి ఒక నీచమైన చర్య అని టెర్రరిజాన్ని అంతం చేస్తామన్న ప్రధాని మోదీ మాటలకు ప్రజలందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందని పాకిస్తాన్ మూల్యం చెల్లించుకోవాల్సిన రోజు ఎంతో దూరంలో లేదని మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు.జడ్చర్ల నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన వన్ నేషన్- వన్ ఎలక్షన్, వక్ఫ్ సవరణ చట్టంపై మేధావుల అవగాహన సదస్సు కార్యక్రమంలో ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు.అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ 370 ఆర్టికల్ రద్దయిన తర్వాత జమ్మూ కాశ్మీర్ పర్యాటక కేంద్రంగా మారిందని ఎంతో మంది పర్యాటకులు వస్తుండడంతో అది చూసి ఓర్వలేని పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారని అది ఒక పిరికిపంద చర్య అని అమాయక పర్యటకుల పై దాడి చేయడం హేయమైన చర్య అని టెర్రరిజాన్ని అంతం చేస్తామన్న ప్రధాని మోదీ మాటలకు దేశ ప్రజలందరూ అండగా ఉండాల్సిన అవసరం ఉందని ఉగ్రవాదానికి గుణపాఠం చెప్పాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని పాకిస్తాన్ మూల్యం చెల్లించుకోవాల్సిన రోజు ఎంతో దూరంలో లేదని ఆమె అన్నారు. ఆమె వెంట బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, సాహితీ రెడ్డి ఎడ్ల బాలవర్ధన్ గౌడ్, అమర్నాథ్ గౌడ్ పల్లె తిరుపతి, ఎంబీ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

మీకు డబ్బున్న వాళ్లే కనిపిస్తారా?

జనసేన అధినేత, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని మరోసారి ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో దళితులను వెలివేస్తే ఆయన అస్సలు పట్టించుకోలేదని విమర్శించారు.దళితురాలైన హోంమంత్రి అనిత సైతం ఆ వైపు కన్నెత్తి చూడలేదని పేర్ని అన్నారు. వీరయ్య చౌదరిని మద్యం గొడవల్లో చంపేస్తే హోంమంత్రి అక్కడకు పరిగెత్తారని అన్నారు. మీకు డబ్బున్నవారే కనిపిస్తారా, సామాన్యులు, దళితులను పట్టించుకోరా అంటూ నిలదీశారు.గతంలో తమ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులపై విష ప్రచారం చేశారని, ఎల్లో మీడియా, చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి నానా యాగీ చేశారని అన్నారు. ఇప్పుడు చంద్రబాబు లక్షా 3 వేల కోట్ల అప్పు నేరుగా తెచ్చారని అన్నారు. రూ.44 వేల కోట్లను కార్పొరేషన్ల ద్వారా అప్పు తెచ్చారని అన్నారు. మొత్తం ఒక లక్షా 47 వేల కోట్లకు పైగా అప్పులు చేశారని అన్నారు. జగన్ హయాంలో చేసిన అప్పులతో పోర్టులు, గ్రామ, వార్డు సచివాలయ భవనాలు, ఆర్బీకే భవనాల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధి ఇలా అనేక రూపాల్లో కనిపిస్తున్నాయన్నారు.జగన్ ఖర్చు చేసిన ప్రతి రూపాయికి లెక్క ఉందని కానీ చంద్రబాబు చేస్తున్న అప్పులు ఏం చేస్తున్నారో చెప్పడం కూడా లేదన్నారు. ఎన్నికలకు ముందు ఉత్తరకుమార ప్రగల్భాలు పలికిన చంద్రబాబు.. ఇప్పుడు సంక్షేమ పథకాలు ఎలా ఇవ్వాలో అర్థం కావడం లేదంటున్నారన్నారు. ఏపీలో కూటమి సర్కారుకి బిల్డప్ ఎక్కువ, బిజినెస్ తక్కువ అంటూ పేర్ని ఎద్దేవా చేశారు.

నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టింది ఆయనే

దేశంలో మొట్టమొదటిసారి నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టింది సీఎం చంద్రబాబు అని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు ఆయన వినుకొండ లో నిర్వహిస్తున్న ఎడ్ల పందాల పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. పట్టిసీమ)తో గోదావరి నది జలాలను కృష్ణా)కు తీసుకొచ్చి రాయలసీమ ప్రజల కష్టాలను తీర్చారని అన్నారు. ఇక పోలవరం బనకచర్ల అనుసంధానంతో ప్రతి ఎకరానికీ నీరందించే ప్రణాళికను కూడా సిద్ధం చేశారని తెలిపారు. రైతుల కష్టాలు తీర్చే ఈ ప్రాజెక్టుకు పార్టీలకు అతీతంగా అందరూ తమ సంపూర్ణ మద్దతును ఇవ్వాలని గొట్టిపాటి పిలుపునిచ్చారు.

తాకట్టులో ఖజానా

అప్పుల విషయంలో రాజ్యాంగ విరుద్ధమైన విధానాలకు తెగబడిందని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థ ఏపీఎండీసీ నుంచి రూ.9 వేల కోట్ల అప్పులను బాండ్ల రూపంలో సేకరిస్తున్న విధానంలో భారీ అవకతవకలకు పాల్పడుతున్నారని ఆక్షేపించారు. ఆర్బీఐ నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు ప్రభుత్వంతో సంబంధం లేకుండా నేరుగా బాండ్ల కొనుగోలుదారులకు మళ్లించేందుకు అనుమతి ఇచ్చారని తెలిపారు. ఇది దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసమర్థ పాలన, అస్తవ్యస్త ఆర్థిక విధానాలకు ఇది నిదర్శనమని ధ్వజమెత్తారు. రాజ్యాంగ విరుద్ధమైన ఈ చర్యకు అనుమతించిన అధికారులు భవిష్యత్తులో సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. బుగ్గన గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..కూటమి ప్రభుత్వం కొత్తగా బడ్జెట్ వెలుపల భారీ అప్పులు చేయడం ప్రారంభించింది. సంపద సృష్టి జరగడం లేదు. ఏపీఎండీసీ ద్వారా రూ.9 వేల కోట్లకు బాండ్లు విడుదల చేయడం ద్వారా కొత్తగా అప్పులు చేయాలని స్కీం ప్రారంభించారు. ఏపీఎండీసీ ఆదాయాలను తాకట్టు పెట్టి, దానిపై అప్పులు చేయాలనేదే ఈ స్కీం. బ్యాంకుల నుంచి అప్పు పుట్టకపోవడంతో నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ (ఎన్‌సీడీ) బాండ్స్ మీద అప్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీఎండీసీ ఎక్కువగా ఔట్ సోర్సింగ్ ద్వారానే కార్యకలాపాలు నిర్వహిస్తుంది. కాబట్టి ఆ సంస్థకు మూలధన వ్యయం పెద్దఎత్తున అవసరం లేదు. కానీ, రూ.9 వేల కోట్లు కావాలని బాండ్లు జారీ చేస్తున్నారు.

ప్రధాని మోడీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నా

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు విచ్చేసిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినదించారు.ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా నిర్మూలించాలన్నారు.కశ్మీర్‌లో పర్యాటకులపై దాడి చేసి చంపేయడం తీవ్రమైన ఘటన అని అన్నారు. ఇతరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సీఎం డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడిన వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీలకు అతీతంగా పనిచేస్తూ తీవ్రవాదాన్ని అంతం చేయాలన్నారు. అంతా ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని సీఎం రేవంత్?రెడ్డి పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై పోరులో 140 కోట్ల మంది ప్రజలు ప్రధాని వెంట ఉంటారని చెప్పారు.ఈ విషయంలో మోడీ కి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. 1971లో పాకిస్థాన్‌ను ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారని, ఆనాడు ఇందిరాగాంధీని దుర్గామాతతో వాజ్?పేయ్?పోల్చారని పేర్కొన్నారు. మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి అని అన్నారు. పీవోకేను భారత్‌ను కలపాలి, ఇందిరాగాంధీని గుర్తుకుతెచ్చుకొని పాకిస్తాన్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న భారత్‌పై ఉగ్రదాడి జరిగిందని, పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా ఉగ్రవాదంపై పోరు చేయాలన్నారు. ఉగ్రదాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలి అని సీఎం రేవంత్?రెడ్డి డిమాండ్?చేశారు.జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు.ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు.మొత్తం 140 కోట్ల మంది ప్రజలు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత్‌లోకి చొచ్చుకొచ్చి.. పాక్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. "ఉగ్రవాదంపై పోరులో 140 కోట్ల మంది ప్రజలు ప్రధాని వెంట ఉంటారు. ఈ విషయంలో మోదీకి మద్దతు తెలుపుతున్నా. బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారు. ఆనాడు ఇందిరాగాంధీని దుర్గామాతతో వాజ్‌పేయీ పోల్చారు. మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి. పీవోకేను భారత్‌లో కలపాలి. ఇందిరాగాంధీని గుర్తుకుతెచ్చుకొని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలి. అభివృద్ధి పథంలో నడుస్తున్న భారత్‌పై ఉగ్రదాడి జరిగింది. పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా ఉగ్రవాదంపై పోరు జరపాలి. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతం చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. ఉగ్రదాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలి" అని అన్నారు.ఉగ్రవాదంపై పోరులో యావత్ భారతదేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అండగా ఉంటుందని, పాకిస్థాన్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నా మోదీకి మద్దతు ఇస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. రేవంత్ రెడ్డితో పాటు పలువురు మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీని వాజ్‌పేయి దుర్గామాతతో పోల్చారని తెలిపారు. మనం మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలని, పీవోకేను భారత్‌లో కలపాలని అన్నారు. ఇందిరాగాంధీని గుర్తు చేసుకొని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలని అన్నారు. అభివృద్ధి పథంలో నడుస్తున్న మనదేశంపై ఉగ్రదాడి జరిగిందని, ఉగ్రదాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు."140 కోట్ల మంది భారతీయులు రాజకీయాలకు, పార్టీ సిద్ధాంతాలకు అతీతంగా అందరం ఒక్కటై తీవ్రవాదంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. అందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, అందరినీ ఆహ్వానించింది. భారత ప్రభుత్వానికి అండగా నిలబడాలని, కేంద్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి చర్యకు మద్దతుగా నిలబడాలని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం" అని రేవంత్ రెడ్డి అన్నారు."ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది భావోద్వేగ సందర్భం. ఇలాంటి సమయంలో మనమంతా ఏకమై భారత సార్వభౌమాధికారాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి ప్రపంచానికి ఆదర్శంగా నిలబడాల్సిన సందర్భం ఇది. మన దేశం మీద జరిగే దాడులను తిప్పికొట్టేందుకు, కుట్రలు పన్నిన వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉంది. ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉండాలి. ఆ కుటుంబాలకు మనోధైర్యం ఇవ్వాలి" అని అన్నారు.

అప్పటిలా కాదు... ఇప్పుడు ప్రతి గ్రామంలో మనం ఉన్నాం

గతంలో కాంగ్రెస్ హయాంలో తనను అన్యాయంగా 16 నెలల పాటు జైలులో ఉంచారని, పార్టీని నడపలేని పరిస్థితులు కల్పించినా ప్రజలు తనను, పార్టీని ఆదరించారని ఆయన గుర్తు చేసుకున్నారు.వీఏసీ సమావేశంలో జగన్ మాట్లాడుతూ, "నాడు నన్ను 16 నెలలు జైలులో పెట్టారు. పార్టీని నడిపే పరిస్థితి లేకుండా చేశారు. అయినా ప్రజలు ఆశీర్వదించారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో మన పార్టీ ఉంది. వాళ్లు ఎన్ని కేసులు పెడితే ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారు. నన్ను మరోసారి జైలుకు పంపినంత మాత్రాన ప్రజా వ్యతిరేకతను అణచివేయలేరు" అని అన్నారు. గతంలో అక్రమాస్తుల కేసులో తనను అన్యాయంగా ఇరికించి జైలుకు పంపినా, ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి అఖండ విజయాన్ని అందించారని జగన్ గుర్తుచేశారు. అదే విధంగా, ఇప్పుడు కూడా ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కేసులు బనాయించినా ప్రజల మద్దతు తమకే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఎదురైనా ఎదుర్కొనేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని జగన్ ఈ సమావేశం ద్వారా సంకేతాలు పంపారు. ప్రభుత్వ చర్యల వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగి, అది అంతిమంగా తమ పార్టీకే లాభిస్తుందని అభిప్రాయపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఒక వ్యాఖ్య చేశారు. చంద్రబాబు ప్రభుత్వం ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ఏమవుతుందని ప్రశ్నించారు. జైలుకు పంపినంత మాత్రాన ప్రజా వ్యతిరేకతను అణచి వేయలేరని ఆయన స్పష్టం చేశారు. గతంలో తనను 16 నెలలు జైలులో పెట్టారని, పార్టీని నడిపే పరిస్థితి లేకుండా చేశారని, అయినా ప్రజలు ఆశీర్వదించారని గుర్తు చేశారు. ఇప్పుడు ప్రతి గ్రామంలో పార్టీ ఉందని, ఎన్ని కేసులు పెడితే ప్రజలు అంత తీవ్రంగా స్పందిస్తారని పేర్కొన్నారు. జగన్ వ్యాఖ్యలు హేతుబద్ధమైనవి. మద్యం కేసుతో పాటు సీనియర్ పోలీసు అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులును అరెస్టు చేయడంపై ఆయన స్పందించారు. ఒక్కసారి గతంలోకి వెళితే 2011లో జగన్ కాంగ్రెస్ ఎంపీగా ఉండే వారు. తండ్రి మరణం తర్వాత జరిగిన పరిణామాలలో ఆయన సొంతంగా పార్టీని స్థాపించుకోవాలని నిర్ణయించుకుని పదవికి రాజీనామా చేశారు. కడప లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికలో 5.45 లక్షల ఓట్ల అధిక్యతతో విజయం సాధించి జగన్ సంచలనం సృష్టించారు. అప్పుడు కూడా కాంగ్రెస్, టీడీపీలు కలిసే కుట్ర చేశాయి. జగన్‌ను ప్రజా క్షేత్రంలో ఓడించాలేమన్న భయంతో చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఏపీలో కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంపై వచ్చిన అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వకుండా తటస్థంగా వ్యవహరించి కాంగ్రెస్‌కు అండగా నిలిచారు. ఆ తర్వాత జగన్ కంపెనీలతో సంబంధం లేని కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకరరావుతో హైకోర్టులో ఫిర్యాదు చేయించడం, దానికి టీడీపీ మద్దతివ్వడం, ఆ వెంటనే హైకోర్టు ఆ కేసును సీబీఐకి అప్పగించడం జరిగిపోయాయి.తదుపరి సీబీఐ కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దలు ముఖ్యంగా సోనియాగాంధీ ఆదేశాల ప్రకారం వ్యవహరించి జగన్‌ను జైలులో పెట్టింది. బెయిల్ రాకుండా కూడా అడ్డుపడ్డారు. చివరికి 16 నెలల తర్వాత బెయిల్ లభించింది. అయినా ఆయన రాజకీయంగా నిలబడ్డారు. జైలులో ఉన్నప్పుడు జరిగిన 18 ఉప ఎన్నికలలో 15 చోట్ల జగన్ పార్టీ విజయ దుంధుభి మొగించింది. ఆ అనుభవాలను మననం చేసుకుంటే సరిగ్గా అదే రీతిలో ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం వైసీపీ నేతలపై, కొందరు అధికారులపై కేసులు పెడుతున్నట్లు కనిపిస్తుంది. కూటమి అధికారంలోకి రాగానే రాజకీయ ముద్ర వేసి కొందరు అధికారులను సస్పెండ్ చేయడం చేశారు. పోస్టింగులు ఇవ్వకుండా వేధించారు. ఒక మోసకారి నటిని పట్టుకు వచ్చి పోలీసు ఉన్నతాధికారిపై కేసు పెట్టించి, తదుపరి ఆయనను జైలులో పెట్టారు. మరో వైపు అనేక మంది వైసీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై కేసులు పెడుతూ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు. ఇందు కోసం కొందరు రిటైర్డ్ పోలీసు అధికారులను కూడా ఉపయోగించుకుంటున్నారని చెబుతారు. ఆ తర్వాత తమ రెడ్‌బుక్‌ను పై స్థాయికి తీసుకు రావడానికి ప్రయత్నాలు ఆరంభించారు. దీనికి తగ్గట్లే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో కూడా ఈ కేసుపై చర్చించారని అనుకోవాలి. పైకి పోలవరం-బనకచర్ల తదితర అంశాలపై షా ను కలిసినట్లు ఎల్లో మీడియాలో వార్తలు రాయించుకున్నారు. ఆ పత్రికలలోనే జగన్‌పై మద్యం కేసు విషయంపై కూడా మాట్లాడారని తెలిపారు. అంటే గతంలో కాంగ్రెస్‌తో కుమ్మక్కై పెట్టినట్లుగానే, ఈసారి బీజేపీతో ఒప్పందమై ఇలాంటిదేదో చేయాలని చూస్తున్నట్లు ఉన్నారు.2014 టర్మ్‌లో బీజేపీతో పొత్తులో ఉన్నపుడు ప్రధాని మోడీని చంద్రబాబు కలిసినప్పుడల్లా కేవలం జగన్ కేసులపై ఏదో ఒకటి చేయాలని కోరుతుండేవారని, అప్పటి బీజేపీ అధ్యక్షుడు, ఇప్పటి టీడీపీ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆ రోజుల్లో పలుమార్లు చెప్పేవారు. అదే తరహాలో ఇప్పుడు కూడా బీజేపీ పెద్దలతో సంప్రదించి తన కుట్ర ప్లాన్ అమలు చేయాలని తలపెట్టినట్లు అనుమానాలు వస్తున్నాయి. జగన్ పై 2011 లో పెట్టిన కేసులు ఏమిటి? ఆయన కంపెనీలలో కొందరు పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టారని అందులో క్విడ్ ప్రోక్ జరిగిందని సీబీఐ ఆరోపించింది. అయితే ఇందుకు సంబంధించిన ఏ కంపెనీ కూడా జగన్‌పై ఫిర్యాదు చేయలేదు. అలాగే ప్రభుత్వం, మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలతో జగన్‌కు సంబంధం లేదు. అయినా తన కంపెనీలు ఏర్పాటైన మూడేళ్ల తర్వాత కక్షపూరితంగా కేసులు పెట్టారు. ఇప్పుడు కూడా అదే మోడల్ కనిపిస్తుంది. మద్యం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని ఏ డిస్టిలరీ ఫిర్యాదు చేయలేదు. ఎవరో దారినపోయే వ్యక్తి లెటర్ రాయడం, ఆ వెంటనే దానిపై ప్రభుత్వ కార్యదర్శి ఏసీబీ విచారణకు విచారించాలని పంపడం, తదుపరి ఆగమేఘాల మీద కేసు పెట్టడం అనుమానాలకు తావిస్తోంది. ఈ కేసు దర్యాప్తులో సిట్ అధికారులు బెవరేజెస్ కార్పొరేషన్ అధికారులను బెదిరించి వాంగ్మూలాలను తీసుకోవడం, వారు హైకోర్టును ఆశ్రయించడం, ఆ తర్వాత వేధింపులు తట్టుకోలేక పోలీసు అధికారులు కోరిన స్టేట్మెంట్ పై సంతకాలు చేశారట.

దారితప్పిన వైద్యులపై చర్యలు

ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. విధులకు హాజరు కాకుండా వచ్చినట్లు రిజిస్టర్లలో సంతకం చేయడం, లంచాలు తీసుకుని వైకల్య ధ్రువపత్రాలు జారీ చేయడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టారని పలువురు వై ద్యులపై ఆరోపణలొచ్చాయి. దీనిపై మంత్రి ఏసీబీ విచారణకు ఆదేశించారు. గుడివాడలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిరాదేవి ఆస్పత్రికి రాకుండా హాజరు రిజిస్టర్లలో సంతకాలు చేస్తున్నారంటూ ఒక వ్యక్తి చేసిన ఫిర్యాదును డీసీహెచ్ ఉన్నతాధికారులు పరిశీలించారు. గతేడాది జనవరి-మార్చి కాలంలో ఆమె 22రోజులు ఆస్పత్రికి రాలేదని తేలింది. ఆయా రోజుల్లోనూ ఆమె రిజిస్టర్‌లో సంతకాలు చేయడంతో పాటు ముఖ ఆధారిత హాజరు కూడా నమోదు చేశారు.అయితే ఆ సమయంలో ఆమె ఒకరోజు మచిలీపట్నంలో, 8 రోజులు తణుకులో, 13 రోజులు విశాఖపట్నంలో ఉన్నట్లు వెల్లడైంది. ఇందిరా దేవిపై చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఎమ్మిగనూరు ఏరియా ఆస్పత్రిలో సివిల్ సర్జన్ స్పెషలిస్టుగా పనిచేస్తున్న సుధ 2022 ఫిబ్రవరి నుంచి ఏడాది పాటు అనుమతులు తీసుకోకుండా విధులకు దూరంగా ఉన్నారు. దీనికి సంబంధించి హేతుబద్ధమైన కారణాలు చూపనందున విచారణకు మంత్రి ఆదేశించారు. కాగా, దివ్యాంగులకు వైకల్య ధ్రువపత్రాలు జారీ చేసేందుకు రూ.10వ

మా హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా...?

కడప ఏప్రిల్ 27 యువతరం న్యూస్: విజయవాడలో బీసీ నేత కేసన శంకర్రావు అరెస్ట్ అప్రజాస్వామికం బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు డిఎం ఓబులేసు యాదవ్ ఖండించారు.ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి బీసీ లకు రక్షణ చట్టం కల్పిస్తానని మేనిఫెస్టోలో చేర్చింది బీసీలకు రక్షణ చట్టం కల్పించాలని, ఓబీసీ కుల జన గణన వెంటనే చేపట్టాలని, 33% మహిళా రిజర్వేషన్లు బీసీ మహిళలు వాటి తేల్చాలని ఈరోజు విజయవాడలో శాంతియుతంగా మహార్యాలీ కార్యక్రమం చేస్తున్న ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావును అత్యంత దుర్మార్గంగా అరెస్టు చేయటం హేయమైన చర్య అని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు డిఎం ఓబులేసు యాదవ్ ఖండించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డిఎం ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఓబీసీ కులగణన చేసి బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తుంటే ఆంధ్రప్రదేశ్లో బీసీలకు పరిస్థితి ఏంటి అని ఆయన ప్రశ్నించారు. తక్షణమే కూటమి ప్రభుత్వం బీసీల జనాభా సంఖ్యలు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు 78 సంవత్సరాలు గడుస్తున్నా బీసీలకు కులంకాలను చేయకపోవడంలో అంతరమేమిటని ప్రశ్నించారు. కుల గణన జరిగితేనే ఆర్థికంగా సామాజికంగా విద్యాపరంగా రాజకీయపరంగా అన్ని రకాలుగా అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు.

కలుషితమైన నిప్పుల వాగును శుభ్రం చేసి, పశుపక్షాదులకు త్రాగునీటి కోసం మట్టి ఆనకట్టను కట్టిన వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ

పాములపాడు ఏప్రిల్ 27 యువతరం న్యూస్:పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలో గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, కంభం.మోహన్ గౌడ్, గంట. రమేష్, ఆదిరెడ్డి, గంట.మధు సుధాకర్, వై. దానమయ్య, లెనిన్ బాబు,శంకర్ రాములు నాయక్, హుసేన్ తదితరులతో కలిసి కలుషితమైన నిప్పుల వాగును శుభ్రపరచి, పశుపక్షాదుల త్రాగునీటి కోసం మట్టి ఆనకట్టను వేయడం జరిగింది. ఈ సందర్భంగా వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ మాట్లాడుతూ నిప్పుల వాగు చెత్తాచెదారం నిండిపోయి కలుషితంగా ఉండేదని, దానిని జెసిబి సహాయంతో తీసివేసి, గ్రామ నాయకులతో కలిసి పశుపక్షాదుల మంచినీటి కొరకు, గ్రామంలోని కుళాయిలకు నీటి నిల్వ కొరకు మట్టి ఆనకట్టను నిర్మించడం జరిగిందన్నారు. ఈ నీళ్ల వలన ఎండలు తీవ్రతరంగా ఉన్న ఈ వేసవికాలంలో నీటి కొరత నిర్మూలించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

రజకుల ఐక్యత తో ఆర్థిక స్వావలంబన

రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి

నంద్యాల బ్యూరో ఏప్రిల్ 27 యువతరం న్యూస్: పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో జిల్లా రజక ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి పాల్గొనగా రజక ఐక్యవేదిక అధ్యక్షులు సిహెచ్ సురేష్ ఆమెకు సాదరంగా ఆహ్వానం పలికి గజమాలతో సత్కరించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని 70 గ్రామాల నుంచి రజక సమస్యలపై వినతులు స్వీకరించామని, ఈ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా కేంద్రంలో ధోబిఘాట్ ఏర్పాటుకు స్థల సేకరణ చేస్తున్నామన్నారు. జీవో నెంబర్ 6,27 లను అమలు చేయాలని ప్రభుత్వానికి నివేదిక అందించామన్నారు. రజకుల ఐక్యతతోనే ఆర్థిక స్వావలంబన సాధ్యమన్నారు. ప్రతి రజకుడు లేబర్ కార్డు పొంది ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుసుమాంబ,నందవరం శ్రీనివాసులు, తెల్లాకుల రాజశేఖర్, సిమెంటు మద్దిలేటి, సీడ్స్ మద్దిలేటి, నాగరాజు ,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం మండలం రాజుపేట వద్ద ఆటో బోల్తా

16 మందికి గాయాలు ముగ్గురి పరిస్థితి విషమం

బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

బద్వేలు ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: కడప జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం రాజుపేట వద్ద ఆటో బోల్తా పడడం జరిగిందిజరిగింది దీనిలో 16 మంది గాయాలయ్యాయి గాయాలు అయినవారిని బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు ఇందులో ముగ్గురికి పరిస్థిత విషమంగా వారి పేర్లు కే సుభద్రమ్మ చెన్నంపల్లి మెట్ట 2. కే సరోజమ్మ నంది పల్లె %ఎ% ఇంద్రమ్మ నంది పల్లె మిగతా వారందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు పేరయ్య తమ్ముని కొడుకు చిన్న పిల్లవాడు తోలడం వల్ల ఆటో ప్రమాదం జరిగిందని జరిగిందని పనికి వెళ్లిన లక్ష్మీదేవి తెలిపారు, స్థానికుల వివరాల మేరకు ఆటో తోలుతున్న వ్యక్తికి 15 సంవత్సరాలని అలాంటి వారికి ఆట ఎలా ఇచ్చారని స్థానికులు చెప్తున్నారు.

పోలేరమ్మ ఉత్సవాల్లో బద్వేలు టిడిపి సమన్వయకర్త రితేష్ రెడ్డి

బద్వేలు ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: బద్వేల్ పట్టణంలోని 18 వ వార్డులో కొలువై ఉన్న శ్రీరాముని రామాలయం గుడి నిర్మించి 41 రోజుల అయిన సందర్భంగా పోలేరమ్మ తల్లి ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు బద్వేల్ శివకుమార్ ఆహ్వానం మేరకు బద్వేల్ టిడిపి సమన్వయకర్త యువనేత రితిష్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. పోలేరమ్మ తల్లి పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంగల్ రెడ్డి మిత్తి కాయల రమణ ప్రసాద్ , సుధాకర్ గారు, నాగేశ్వరావు , శ్రీనివాసులు పెంచలయ్య వెంకటసుబ్బయ్య , వెంకట సుధా జయమ్మ కార్యకర్తలు,నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రాకతో

మత్స్యకారుల జీవితాలలో వెలుగులు

మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో 20, వేలు ఆర్థిక సాయం

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

బద్వేలు ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: కూటమి ప్రభుత్వం రాకతో మత్యకారుల జీవితాలలో వెలుగులు నింపడం జరిగిందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ...ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 20,000 సాయం విడుదల చేస్తామని చెప్పిన హామీని నెరవేర్చడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరు తోందన్నారు. మత్యకారుల సేవలో పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్యకారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి విడుదల చేయడం జరిగింది. దీని వల్ల 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ. 259 కోట్ల లబ్ధి చేకూరింది. సముద్రంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులు ఇబ్బందులు పడకుండా ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించడం జరిగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట విరామ సమయంలో మత్స్యకారులకు ఆర్థిక సాయాన్ని రూ.10,000 నుంచి రూ.20,000కు పెంచి మత్స్యకారుల జీవితాలలో వెలుగులు నింపడం జరిగింది.గత పాలకులు ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 300 కోట్లు ఖర్చు పెట్టామన్నారు. కానీ ఒక్క మత్స్యకారుడు కూడా బాగుపడలేదన్నారు.2014లో తొలిసారిగా తెలుగుదేశం ప్రభుత్వమే వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు భృతిని ప్రవేశ పెట్టింది.2014-2019 మధ్య మత్స్యకారుల సంక్షేమం కోసం రూ.788 కోట్లు ఖర్చు పెట్టాము. అంతేకాకుండా వలలు, పడవలు, ఐస్ బాక్సులు అదనంగా ఇవ్వడం జరిగింది.రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందించడం జరుగుతోంది.మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లిస్తున్నాము.వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నాం.చేపల ఎగుమతుల్లో ఏపీ మొదటి స్థానంలో ఉంది.రాష్ట్రంలో 555 మత్స్యకార గ్రామాలున్నాయి. చేపల ఎగుమతుల్లో మన రాష్ట్రం ముందువరుసలో ఉంది.దేశంలో ఉత్పత్తయ్యే మత్స్యసంపదలో 29 శాతం మన రాష్ట్రం నుంచే ఉంటోంది.ఆంధ్రప్రదేశ్ నుంచి 32 శాతం మత్స్యసంపద ఎగుమతులు జరుగుతున్నాయి.మత్స్యఉత్పత్తుల ద్వారా 16.50 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది.చేపల పెంపకం వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే చేపలు తినాలన్నారు.మనుషుల్లో తెలివితేటలు, పిల్లల మెదడు చురుకుగా పనిచేయాలంటే చేపలు తినాలని మంత్రి కోరారు

మతిభ్రమించి మాట్లాడుతున్నారా

మర్రి దశరథ పబ్లిక్ చర్చకు సిద్ధమా

వైసిపి ప్రభుత్వంలో ఊరు విడిచి పారిపోయిన నువ్వా మాట్లాడేది ఖబర్దార్ జాగ్రత్తగా ఉండాలి

రహస్యంగా బుగ్గన కాళ్లు పట్టుకున్న విషయం మరిచావా సర్పంచ్

వైసీపీ నాయకులు

డోన్ ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: లిక్కర్ స్కాంలో మాజీ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి లాంటి పెద్ద చేపను మరిచారని మీడియా ద్వారా టిడిపి నాయకులు మర్రి రమణ విమర్శించిన విషయం తెలిసిందే ఈ విషయంపై స్పందిస్తూ డోన్ పట్టణంలోని వైఎస్ఆర్సిపి కార్యాలయం నందు మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి డోన్ పట్టణానికి చెందిన మర్రి రమణ టీడీపీ నాయకుడు రాత్రి ఏదో కలలో వస్తే దాన్ని పొద్దున్నే మీడియా ద్వారా మాట్లాడటం హాస్యస్పందంగా ఉందని అన్నారు. అదేవిధంగా మర్రి రమణ కూతురు పెళ్లికి మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన తనయుడు పెళ్లికి రావడంతో కోట్ల వాళ్లు మర్రి రమణ ని పక్కన పెట్టారని మీ పార్టీ నాయకులు అనుకుంటున్నారు. అందుకు కోట్ల కుటుంబానికి దగ్గర కావడానికి మాజీ మంత్రి మీద నిందలు వేయడం తగదు మీకు దమ్ము ధైర్యం ఉంటే ఏ చర్చకైనా సిద్ధమే మీరు నిరూపిస్తే మేము వైసిపి పార్టీని తలుపులు మూసేస్తాం మీరు రుజువు చేయకుంటే మీ ఆస్తులు మాకు అప్పజెప్పి రాజకీయ సన్యాసం తీసుకుంటారా ఖబర్దార్ మర్రి రమణ దశరథరామిరెడ్డి,ఇప్పుడు మీ పార్టీ అధికారంలో ఉంది మీరు ఏదైనా ఆధారాలు ఉంటే చట్ట ప్రకారం బయటపెట్టాల గాని అనవసరంగా మా నాయకునీపై నిందలు మోపితే మేము చూస్తూ ఊరుకోము మాజీ మంత్రి బుగ్గన రాజకీయంలో మచ్చ లేని వ్యక్తి గా ఉన్నారని అలాంటి వ్యక్తి పై బురదజల్లె ప్రయత్నాలు చేస్తున్నారని.ఒక బచ్చ సర్పంచ్ అయితే ఆయన నీతికి నిజాయితీకి నిలువుటద్దంల మాట్లాడుతున్నాడని దయ్యాల వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. దొంగ బిల్లులు సృష్టించుకుని గ్రానైట్ వ్యాపారం చేస్తున్న నువ్వా మా నాయకుని గురించి వాట్సప్ గ్రూపుల్లో మాట్లాడటం సిగ్గుచేటు అంతా మగానివైతే గత ప్రభుత్వంలో ఎక్కడ దాక్కున్నావు గత వైసిపి ప్రభుత్వం లో రహస్యంగా మా బుగ్గన కాళ్లు మొక్కిన సంగతి మరిచావా మర్రి ఖబర్దార్ జాగ్రత్తగా ఉండు అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్,వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్,నంద్యాల జిల్లా వాలంటీర్ విభాగం అధ్యక్షుడు పోస్ట్ ప్రసాద్,జిల్లా ఉపాధ్యక్షులు హరి, మండల అధ్యక్షుడు సోమేశ్ యాదవ్,పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి,కౌన్సిలర్లు మహేశ్వర రెడ్డి,ఆర్ట్ రమణ,నాగేంద్ర మూర్తి,కుమ్మరి రాజు,వైఎస్ఆర్ సీపీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నాలుగో పట్టణ

పోలీస్ స్టేషన్లో పత్రికా సమావేశం

నన్నెవరూ కొట్టలేదు నాదే తప్పు : బాధితుడు నర్సింగరావు

కేసు వివరాలు వెల్లడించిన ఏసిపి లక్షణం మూర్తి

ఉత్తరాంధ్ర ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: విశాఖపట్నం నాలుగవ పట్టణ పోలీస్ స్టేషన్ లో ఆదివారం సాయంత్రం ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో స్టేషన్ సిఐ సత్యనారాయణ ఎస్సై ఇతర సిబ్బందితో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఏప్రిల్ 12 2025న ఉదయం 11 గంటలకు ఆబిద్నగర్ అక్కయ్యపాలెం చెందిన ఆవల నర్సింగరావు వయసు 38 సంవత్సరాలు ను ఏప్రిల్ 11 2025 తేదీన రాత్రి అక్కయ్యపాలెం గ్రీన్ బెల్ట్ పార్కులో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు కొట్టి గాయపరిచినట్టు తన కుమారుడికి కేజీహెచ్ లో చికిత్స అందిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు పై క్రైమ్ నెంబర్ 87/ 2025 అండర్ సెక్షన్ 109 (1) ఆర్ /డబ్లు 3(5)బిఎన్ఎస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా సదరు నర్సింగరావుని ఎవరు కొట్టినట్లు గాని గొడవ పడినట్లు గాని ఎటువంటి ఆధారాలు లభించలేదు అంతేకాకుండా ఈ కేసులో బాధితులైన ఆవాల నర్సింగరావు ఏప్రిల్ 21 2025న హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ పోలీస్ స్టేషన్ కి ఏప్రిల్ 22 2025న వచ్చి ఆరోజు సంఘటన వివరాలను వెల్లడిస్తూ ఆ రోజు సాయంత్రం మద్యం ఎక్కువగా తాగి ఆ తర్వాత రాత్రి సుమారు 9 గంటల సమయంలో తన స్నేహితునితో కలిసి గ్రీన్ బెల్ట్ పార్కులోకి వెళ్లి కూర్చున్న కొద్దిసేపు తర్వాత తన స్నేహితుడిని ఇంటికి వెళ్లిపోమని చెప్పగా అతని వెళ్ళిపోయిన తర్వాత తను ఇంటికి వెళ్లిపోయేందుకు బెంచ్ పై నుండి లేచే సరికి మద్యం మత్తులో తూగి పక్కన ఉన్న రాయిపై తనంతట తానుగా పడిపోవడం వల్ల తలకి బలమైన గాయమైనట్లు తిరిగి లేచే ప్రయత్నంలో మళ్లీ పడిపోవడంతో రక్తస్రావం కూడా అయినట్లు తెలిపారు అంతేగాని ఆ రోజు రాత్రి ఎవరు తనని కొట్టడం జరగలేదని తెలిపారని అన్నారు అదే విషయాన్ని బాధితుడు నరసింగరావు కూడా ధ్రువీకరించారు ఈ కేసు కు సంబంధించిన విషయాలు ముందస్తుగా పత్రికలలో హత్యా ప్రయత్నం గా ప్రచారం కాబడినందున ఈ పత్రిక సమావేశం నిర్వహించి దర్యాప్తు గురించి పత్రికల ద్వారా సమాచారం అందించడం జరిగింది.

నేడు నర్సీపట్నంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమం నిర్వహణ

నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

ఉత్తరాంధ్ర ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: ఈనెల 28వ తేదీన సోమవారం నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయం లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని సూచించారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావా లని సూచించారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కూడ యధావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమం కొనసాగుతుందని ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని ప్రజలు ఈ విషయాన్ని గమనించగలని కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆ ప్రకటనలో కోరారు.

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరణాల. శివ నారాయణ

జమ్మలమడుగు ఏప్రిల్ 27 యువతరం న్యూస్: డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రావు పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరణాల. శివ నారాయణ పేర్కొన్నారు.ఆదివారం నాడు జమ్మలమడుగు లో ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా శివ నారాయణ మాట్లాడుతూ నిరుపేదల ఇళ్లను కూల్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నానని ఎమ్మెల్యే రఘురామ కృష్ణం రాజు అనుకోవడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు.నిరుపేదలు కేవలం రెండు సెంట్లు స్థలాన్ని ఆక్రమించి ఇళ్లను నిర్మించుకుంటుంటే అదేదో మహా పాపం అన్నట్లు వాటిని కూలదోస్తున్నాడని, కానీ బడాబాబులు ఎకరాలలో స్థలాలను ఆక్రమించుకున్నా పట్టించుకోవట్లేదన్నారు. గణపవరం రహదారి లోని రొయ్యవలపు కేంద్రం వద్ద పంట బోదెను పూడ్చి పెద్దపెద్ద నిర్మాణాలు చేసినప్పటికీ వాటిని పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. పది ఎకరాల తూము సమీపంలో బడాబాబులు స్థలాలను ఆక్రమించుకుని షెడ్లు వేశారని, దమ్ముంటే వాటిని పడగొట్ట గలరా అని సవాల్ విసిరారు. సిపిఎం పార్టీ కేవలం ప్రజా పక్షాన మాత్రమే పోరాడుతుందని, ప్రజలకు అన్యాయం చేసే వారు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా నిలదీయగల పార్టీ అని ఆయన గుర్తు చేశారు. పాలకోడేరులో భూస్వాముల అధీనంలో ఉన్న భూములను వదిలేసి నిరుపేదల ఇళ్లను కూల్చడం దుర్మార్గమన్నారు. రఘురామ కృష్ణంరాజు దుర్మార్గాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి నిరుపేదలకు న్యాయం చేసేందుకు వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పై రఘురామ కృష్ణం రాజు అనుచిత వ్యాఖ్యలు చేయడం అతని మూర?త్వానికి నిదర్శనమని, వెంటనే శ్రీనివాసరావుకు రఘురామ కృష్ణంరాజు క్షమాపణలు చెప్పి ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.డిప్యూటీ స్పీకర్ గా ఉండి బెదిరిస్తే భయపడే వ్యక్తులు సిపిఎంలో ఉండరని ఈ విషయాన్ని ఆయన గమనంలో వుంచుకోవాలన్నారు. తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పై డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి

నృత్య జ్యోతి కూచిపూడి వార్షికోత్సవ వేడుకలలో హాజరైన ఏపీ ఎస్ఎస్ డిసిఎల్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

అద్భుతంగా చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

డోన్ ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: డోన్ పట్టణంలో న్యూ రంగా ఫంక్షన్ హాల్ నందు నృత్య జ్యోతి కూచిపూడి నృత్య శిక్షణాకేంద్రం వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, ఈ వేడుకలో పిల్లలు సంప్రదాయ బద్ధంగా కూచిపూడి నృత్యం ప్రదర్శన అద్భుతంగా చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి, మాట్లాడుతూ... ప్రస్తుత పరిస్థితులలో పిల్లలు ఎలక్ట్రానిక్ పరికరాలకు పరిమితమై వారి శారీరక, మానసిక వ్యాయామములకు దూరమైపోతున్నారు. తద్వారా అనేక మానసిక రుగ్మతలకు బానిసలవుతున్నారు. వీటి నుండి పిల్లలను దూరం చేసి వారి బంగారు భవిష్యత్తుకు మార్గం చూపించే విధంగా పిల్లల యొక్క మానసిక,శారీరక పరిస్థితులు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండేందుకు పిల్లలు కూచిపూడి నృత్యము శిక్షణ తీసుకోవాలని అన్నారు. అంతేగాక పిల్లలకు కూచిపూడి నృత్య విధానములోని రీతులను, సిద్ధాంతాలను మరియు అభినయం యొక్క ప్రాముఖ్యతను

తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నృత్య జ్యోతి ఫౌండర్ భార్గవ్ కుమార్,డ్యాన్స్ మాస్టర్ హరినాథ్, రవితేజ, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఈనెల 28 తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాను భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయండి

కర్నూలు ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 28వ తేదీన కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఐటియు నాయకులు తెలిపారు గడియారం హాస్పిటల్ మట్టి పని అడ్డాలో మట్టి కార్మికులతో మీటింగ్ జరిగింది ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) నగర అధ్యక్షుడు అబ్దుల్.దేశాయ్ నగర కార్యదర్శి సయ్యద్ ఖజ పాషా మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వాగ్దానం చేశారని గుర్తుచేశారు ఎన్నికల్లో భవనిర్మాణ కార్మికుల ఓట్లు వేయించుకొని గద్దెనెక్కి ఎనిమిది నెలలు కావస్తున్న ఇంతవరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం గురించి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు రాష్ట్రంలో ఉచిత ఇసుక ప్రకటించిన యధామాములుగా ఇసుక కొనాల్సి వస్తుందని వారు తెలిపారు జియస్టి వేయడం వల్ల బిల్డింగ్ మెటీరియల్స్ సిమెంటు స్టీల్ ధరలు విపరీతంగా పెరిగి పోయాయని దీనివల్ల నిర్మాణాలు ఆగిపోయి కార్మికులకు పనులు లేకుండా పోతుందని వారు తెలిపారు

ఎన్నికల ముందు జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారు భవన్ నిర్మాణ కార్మికులు సమావేశాల్లో జగన్ ప్రభుత్వం నిర్మాణ కార్మికులకు అన్యాయం చేస్తుంది అని మేము అధికారంలోకి వస్తే భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని వాగ్దానం చేశారని తెలిపారు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా అక్రమంగా 1214 జీవోను తీసుకొని వచ్చారని అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను అమలు చేస్తామని సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని అనేక సమావేశాల్లో వాగ్దానం చేసిన కూటమినేతలు నోరు మెదపడం లేదని వారు తెలిపారు కూటమి ప్రభుత్వం వస్తే భవనిర్మాణ కార్మికుల బ్రతుకులు బాగుపడతాయని ఆశించిన కార్మికులకు నిరాశే మిగిలిందని వారు తెలిపారు వెంటనే సంక్షేమ బోర్డు పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని లేకపోతే ఈనెల 28వ తేదీన కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నాలో భవనిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొంటారని ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుంది అని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిసిడబ్ల్యూ యు నగర ఉపాధ్యక్షులు ఎస్.మహబూబ్ బాషా.మాడ్కాల్ ముస నగర నాయకులు ఎస్ . ఫకృద్దీన్. దేవి మద్దిలేటి ఆంజనేయులు చంద్రకళ లక్ష్మీదేవి. ఉమా తదితరులు హాజరయ్యారు.

క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కబర్థి

కర్నూలు క్రీడలు ఏప్రిల్ 27 యువతరం న్యూస్: క్రీడాకారులు కొత్తగా నిర్మించిన రాయల స్పోర్ట్స్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కబర్థి పేర్కొన్నారు.ఆదివారం మిలిటరీ కాలనీ సమీపంలో రాయల స్పోర్ట్స్ క ను జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి కబర్థి, తెలంగాణ రాష్ట్రం లోని మేడ్చల్ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీదేవి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి మాట్లాడుతూ రాయల స్పోర్ట్స్ ను కర్నూలు లో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాయల స్పోర్ట్స్ ను రాయల్ గా నడిపించాలని, జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం అని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రికెట్ ఆటలో బాగా రాణించి కర్నూలు జిల్లాకు మంచి పేరు తేవాలని జడ్జి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పై.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ఆదివారం రాయల స్పోర్ట్స్ క్రికెట్ గ్రౌండ్ ను ఏర్పాటు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.క్రీడాకారులు ఈ స్టేడియం ను వినియోగించుకొని, మంచి నైపుణ్యం సాధించి, క్రికెట్లో రాణించాలన్నారు. ఈ కాంప్లెక్స్ లో స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మించి, ఒక స్పోర్ట్స్ కాంప్లెక్స్ గా తయారవ్వడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రక్కనే ఉన్న ఈ స్థలం దాదాపుగా ఐదు ఎకరాల 50 సెంట్లు భూమిని ఎంసి బీచ్పల్లి , వారి సోదరులు మరియు వారి కుటుంబ సభ్యులు ,తెలంగాణ రాష్ట్రం లోని మేడ్చల్, జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీదేవి గారు ఈ స్థలాన్ని రాయల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉంది అన్నారు, ఈ కాంప్లెక్స్ ను కర్నూలు జిల్లాలోని క్రికెట్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఈ రాయల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం వలన క్రికెట్ క్రీడాకారులకు మంచి అవకాశం అని, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రికెట్ గేమ్స్ నందు మంచి నైపుణ్యం సంపాదించుకోవాలని ఎస్పీ క్రీడాకారులకు సూచించారు.ఉత్సాహంగా క్రికెట్ ఆడిన కలెక్టర్, ఎస్పీ.రాయల స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించిన అనంతరం, కలెక్టర్, ఎస్పీ క్రికెట్ ఆడారు. ఇరు జట్లకు నాయకత్వం వహించి ఉత్సాహంగా క్రికెట్ ఆడి యువతలో స్ఫూర్తి నింపారు.. క్రికెట్ క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ ఆర్డిఓ సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డిఎస్ డివో భూపతి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, లాయర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బద్వేలు నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమావేశం

బద్వేలు ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్, వైయస్సార్ జిల్లా విభాగం వారి ఆధ్వర్యంలో బద్వేల్ నియోజకవర్గంలో పోరు మామిళ్ల బద్వేలు వేదికలుగా ఆత్మీయ సమావేశములు నిర్వహించబడినవి. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు యొక్క ప్రధాన సమస్యలు అయినటువంటి ప్రమోషనల్ ఛానల్, వివిధ ఇంజనీరింగ్ విభాగములలో విలీనం క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఎదుర్కొన్నటువంటి వివిధ సమస్యల గురించి విపులముగా చర్చించడం జరిగినది. ఈ సమస్యల పరిష్కారమునకు క్షేత్రస్థాయి నుంచి ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ ముందుకు వచ్చి ఐకమత్యముగా వారి యొక్క సహాయ సహకారములు అందించవలసినదిగా సంఘం నుంచి పిలుపును ఇవ్వడం జరిగినది. దీనికి వారి నుంచి మంచి స్పందన వచ్చినది. భవిష్యత్తు కాలంలో సంఘం పేరు మీద ఒక వెబ్సైట్ ని కూడా ప్రారంభించి తద్వారా ఫిర్యాదుల సేకరణ మరియు వివిధ ఉపయోగకరమైన కార్యకలాపములు జరపబడునని సంఘ పెద్దలు హామీ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ శ్రీ శ్రీకర రావు జిల్లా ప్రెసిడెంట్ శ్రీ మురళీధర్ రెడ్డి జిల్లా జనరల్ సెక్రటరీ దామోదర్ ,జిల్లా వైస్ ప్రెసిడెంట్లు శ్రీ సుబ్బారెడ్డి ఖలీల్ భాషా తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు మత్స్యకారుల పాలాభిషేకం

ఉత్తరాంధ్ర ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: రాష్ట్ర మత్స్యకార కులాల సంక్షేమానికి కృషి చేస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతగా, మత్స్య కార నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. శనివారం సాయంత్రం విశాఖపట్నం పౌరగ్రంథాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమం మత్స్యకార నేతల ఉత్సాహం రెట్టించింది.జి.ఓ. నెం.217 రద్దు, జీవన భృతి రూ.20,000 పెంపు, ఆయిల్ సబ్సిడీ, వేట పరికరాల పంపిణీ వంటి పథకాల అమలుకు కృతజ్ఞతలు తెలుపుతూ మత్స్యకారులు కూటమి ప్రభుత్వానికి మద్దతు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మత్స్యకార కులాల అభివృద్ధికి మద్దతు కొనసాగించాలని నేతలు కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నడకుదిటి అర్జున్, ప్రధాన కార్యదర్శి చింతకాయల ముత్యాలు, చైర్మన్ చిలకలపూడి పాపారావు, పీజీ అప్పారావు, తెప్పల శాంతారామ్, కాటా గోపి, తుమ్మల రమేష్, మాతా గురునాథరావు, పుట్టా శివ, సాయి బలరాం, జీవి రమణారావు, అంగ కృష్ణ, పలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తపల్లిలో ఆలయ భూముల కౌలుకు వేలం పాట సద్వినియోగం చేసుకోండి

శ్రీ పార్వతి దేవి సమేత శ్రీతాండవమల్లేశ్వరస్వామి దేవస్థానం

శ్రీఆంజనేయస్వామి దేవస్థానం

కొత్తపల్లి మార్చి 27 యువతరం న్యూస్: మండల కేంద్రంలోని కొత్తపల్లి గ్రామంలో శ్రీ తాండవ మల్లేశ్వరస్వామి, శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయానికి చెందిన భూముల బహిరంగ వేలం పాటను సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కార్తిక్ శనివారం తెలిపారు. ఈ రెండు ఆలయాలు శ్రీ తాండవ మల్లేశ్వరస్వామి,శ్రీ ఆంజనేయస్వామి చెందిన 58 ఎకరాల భూమిని కౌలుకోసం దేవదాయ శాఖ,గ్రామ పెద్దల సమక్షంలో ఈ వేలంపాట వేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకి వేలంపాట ప్రారంభమవుతుందని ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వియోగం చేసుకోవాలని అన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని చాకలి శివానంద అక్కడికక్కడే దుర్మరణం

కన్నీటి పర్వతమైన కుటుంబ సభ్యులు

బుక్కరాయసముద్రం ఏప్రిల్ 27 యువతరం న్యూస్: బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో చాకలి శివానందు (28) అక్కడికక్కడే మృతి.మృతుడు దయ్యాల కుంటపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గా గుర్తింపు.అనంతపురం నుంచి ద్విచక్రవాహనంపై గ్రామానికి తిరిగి వస్తుండగా ఘటన చోటు చేసుకుంది ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

కొండాపురం రోడ్డు ప్రమాదం లో గాయపడిన డ్రైవర్ కి ఆర్థిక సహాయం

కొండాపురం ఏప్రిల్ 27 యువతరం న్యూస్: పులివెందుల - వేంపల్లి ప్రధాన రహదారిలో గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కార్పియో వాహనం టైరు పగిలి బోల్తా పడి కొండాపురానికి చెందిన డ్రైవర్ అశోక్ కి గాయాలయ్యాయి. ఈ సందర్భంగా కొండాపురం కార్ ఓనర్స్, డ్రైవర్ అసోసియేషన్స్ చికిత్స కోసం ఆదివారం సాయంత్రం ఆయన ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాబు, ఇమామ్ బాషా, అశోక్, రఫీ మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యను ప్రైవేట్ పరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

కర్నూల్ టౌన్ ఏప్రిల్ 27 యువతరం న్యూస్: ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలకు యాజమాన్యం చేతిలో రాష్ట్ర ప్రభుత్వం కీలు బొమ్మల మారిందని మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నగేష్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు రెండు రోజులు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్లా, రంగప్ప అధ్యక్షతన నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా నాయకులు నగేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలో యాజమాన్యం ఎలా చెబితే అలా నిర్ణయాలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చాలగటం ఆడుతుందన్నారు. ఒకవైపు ఫీజుల పేరుతో ర్యాంకుల పేరుతో విద్యార్థులను వేధిస్తూ వారిని మానసికంగా శారీరకంగా ఇబ్బందులకు గురిచేస్తున్న విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోపోవటం చాలా అనుమానాలకు తావిస్తుందన్నారు. ప్రతి విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు పూర్తి కాగానే సెలవలు ఇచ్చేవారు కాని ఈ సంవత్సరం మాత్రం అలా కాకుండా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, ఇంటర్మీడియట్ విద్యా మండలి అధికారులు క్లాసులు నిర్వహించటం అడ్మిషన్లు చేసుకోవచ్చు అని చెప్పటం ప్రైవేట్, కార్పొరేట్ కలశాలల యాజమాన్యం విచ్చల విడిగా క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థులను నేటివరకు సెలవలు ఇవ్వని పరిస్థితి కనిపిస్తుంది. దినికి కారణం ఇంటర్మీడియట్ విద్యా మండలిలో నారాయణ, శ్రీ చైతన్య, యాస్ఆర్, ఇతర ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలకు చెందిన వారికి కి ప్రభుత్వంలో చోటు కల్పించటం వల్లనే ఈ కార్పొరేట్ విద్యా విధానాలు ఈ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యను నాశనం చేస్తున్నాయి అన్నారు. వారి మెప్పు కోసమే విద్యాశాఖ మంత్రి పని చేస్తున్నారు తప్ప విద్యార్థుల కోసం కాదని ఆరోపించారు. ఇప్పటికైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారలోకేష్ మొద్దు నిద్ర వీడి తక్షణమే ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు సెలవులు మంజూరు చేసి వారిని మానసిక ఒత్తిడి నుండి దూరం చేయాలని వారు డైమండ్ చేశారు. ఈ కార్యక్రమం జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్, జిల్లా సహాయ కార్యదర్శి సంయుక్త, నగర నాయకులు ఆర్యన్, యోగి, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

పిలా శ్రీనివాసరావుకి మేయర్ అభ్యర్థి గా బి ఫాం అందజేస్తున్న జిల్లా టిడిపి అధ్యక్షులు గండి బాబ్జి

విశాఖ అభివృద్ధి కోసమే మేయర్ ను మారుస్తున్నాం గండి బాబ్జి

ఉత్తరాంధ్ర ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: మేయర్ మార్పు విశాఖ అభివృద్ధి కోసమే జరుగుతుంది అని రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండి బాబ్జి అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పీలా శ్రీనివాసరావు కి బీఫాం బాబ్జి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైతే నాలుగేళు జీవీఎంసీ వైసిపి పాలనలో విశాఖ అభివృద్ధి కుంటు పడిపోయిందని అన్నారు. కూటమి పాలనలో విశాఖను అభివృద్ధి చేయాలనే దృఢథంతో కూటమి నాయకులు మేయర్ ను మార్చాలని నిర్ణయించారని చెప్పారు . రాష్ట్రంలో కూటమి పాలనతో రాష్ట్రం అభివృద్ధి జరుగుతున్నది. ఇప్పుడు మేయర్ మార్పుతో విశాఖపట్నం మరింత అభివృద్ధి చెందుతుందని బాబ్జి ఆశాభావం వ్యక్తం చేశారు.

సుంకం వసూలు దారులతో వ్యాపారస్తుల ఇబ్బందులు

వెల్దుర్తి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: వెల్దుర్తి మండల కేంద్రం నందు మేజర్ గ్రామపంచాయతీలో సుంకం వసూలు దారులతో వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారికి ఇష్టం వచ్చినట్లుగా వసూలు చేయడం పరిపాటిగా మారింది. గజిట్ ప్రకారంగా వసూలు చేయకుండా వీరు సొంతంగా రేట్లు ముద్రించుకొని వ్యాపారస్తులను ఇబ్బందులు పెడుతున్న తీరు ఆదివారం చోటుచేసుకుంది. వాహనదారులతో వ్యాపారస్తులతో సుంకం వసూలు ఇష్టరాజ్యంగా వసూలు చేస్తున్నందుకు పోలీస్ స్టేషన్ వరకు వెళ్లి ఫిర్యాదులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రాజకీయ నాయకుల అండదండలతో మేజర్ గ్రామపంచాయతీని బ్రష్టు పట్టించారని ప్రజలు వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అలవాటు పడిన సుంకముదారులు ఈ ప్రభుత్వంలో కూడా అలా చేసే వారిపై గ్రామపంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యాపారస్తులు కోరుతున్నారు. సుంకం వసూలు దారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకొని మేజర్ గ్రామపంచాయతీ గజిట్ ప్రకారంగా వసూలు చేస్తే బాగుంటుందని వ్యాపారస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

భారతీయుడి రక్తం మరిగిపోతుంది.. వారికి ఊహించని శిక్ష ఖాయం: మోదీ

ఢిల్లీ: జమ్ముకశ్మీర్‌లో పహల్గాం దాడి ఘటన తర్వాత ప్రతీ భారతీయుడి రక్తం మరిగిపోతుందన్నారు ప్రధాని నరేంద్ర మోదీ. ఈ దాడి సూత్రధారులకు కఠినమైన.. వారు ఊహించని శిక్ష పడుతుందని హెచ్చరించారు. అలాగే, కశ్మీర్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూడలేకనే ఉగ్రవాద సూత్రదారులు దాడులు చేశారని మోదీ ఆరోపించారు.ప్రధాని మోదీ ఈరోజు మన్ కీ బాత్‌లో మాట్లాడుతూ..'కశ్మీర్‌ను నాశనం చేసేందుకే ఉగ్రవాదుల దాడి జరిగింది. కశ్మీర్‌లో అభివృద్ధి వేగం పెరిగింది, టూరిస్టులు సంఖ్య పెరిగి ఆదాయం వృద్ధి చెందింది. దీన్ని ఓర్వలేక దాడులు చేస్తున్నారు. ఈ దాడి ఘటన తర్వాత ప్రతీ భారతీయుడి రక్తం మరిగిపోతుంది. ప్రపంచం భారతదేశం పక్షాన నిలుస్తోంది. ప్రపంచం మొత్తం 140 కోట్ల భారతీయులతో కలిసి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మా పోరాటానికి మద్దతుగా ఉంది.బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుందని హామీ ఇస్తున్నాను. ఈ దాడి సూత్రధారులకు కఠినమైన, వారు ఊహించని శిక్ష పడుతుంది. భారత్‌లోని ప్రజల ఆగ్రహం ప్రపంచం మొత్తంలో ప్రతిఫలిస్తోంది. ప్రపంచ నాయకులు ఫోన్ చేసి, లేఖలు రాసి, సందేశాలు పంపి తమ సంతాపం వ్యక్తం చేశారు. ఉగ్రదాడిని గట్టిగా ఖండించారు. మనం సంకల్పాన్ని బలపర్చుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు మన సంకల్పాన్ని బలోపేతం చేయాలి.దేశం ఇప్పుడు ఏకతాటిపై మాట్లాడుతోంది. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో ఏకతా శక్తి అవసరం. ఉగ్రవాదానికి ప్రోత్సాహం ఇస్తున్న శక్తులు కశ్మీర్‌ను మళ్లీ నాశనం చేయాలనుకుంటున్నాయి. దేశం ఐకమత్యమే మన విజయానికి ఆధారం.

45ఏళ్లు దాటిన మహిళా వర్కింగ్ జర్నలిస్టులకూ పెన్షన్ పథకం వర్తింపు

ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావు

ఉత్తరాంధ్ర ప్రతినిధి ఏప్రిల్ 27 యువతరం న్యూస్: విశాఖజిల్లాలో ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ నుంచి 60ఏళ్లు దాటిన వర్కింగ్ జర్నలిస్టులకు అందించే పెన్షన్ పథకం.. ఇపుడు 45 నిండిన మహిళా జర్నలిస్టులకు కూడా వర్తింప చేయడానికి నిర్ణయం తీసుకున్నామని.. అర్హులైన మహిళా జర్నలిస్టులు పెన్షన్ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చునని ఉపకార్ ట్రస్ట్ చైర్మన్, ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ అధినేత, విశాఖ విద్యాదాత డా.కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, జర్నలిస్టులతోపాటు, మహిళా జర్నలిస్టులకు కూడా చేయూత అందించాలనే సంకల్పంతో మహిళలకు కూడా పెన్షన్ పథకాన్ని వర్తింపచేస్తున్నామన్నారు. 45 దాటిన వర్కింగ్ జర్నలిస్టులకు తమవంతుగా నెలకి రూ.4వేలు పెన్షన్ అందించనున్నామన్నారు. దానికోసం అర్హులైన మహిళా జర్నలిస్టులు వారి యొక్క వివరాలను విశాఖలోని ఆరిలోవ, టిఐసీ పాయింట్ దగ్గర్లోని ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మహిళా జర్నలిస్టులు ఖచ్చితంగా మీడియాలో పనిచేస్తూ ఉండాలని, వారి వయస్సుని తెలియజేసే గుర్తింపు కార్డును, జర్నలిస్టుగా ఏ సంస్థలో పనిచేస్తున్నారో సదరు సంస్థయొక్క గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, కుటుంబ సభ్యులకు చెందిన ఆధార్ కార్డులు, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో ట్రస్టు కార్యాలయంలో సంబంధిత దరఖాస్తును నింపి సభ్యత్వం తీసుకోవాలని కోరారు. దరఖాస్తులు వచ్చిన తరువాత కమిటీ వాటిని పరిశీలించి పథకానికి ఎంపిక చేస్తుందన్నారు. మీడియాలో జర్నలిస్టులతోపాటు మహిళలు కూడా విశేషంగా రాణిస్తున్నారని అలాంటి వారిని గుర్తించి ఈ పథకం ప్రవేశపెట్టినట్టు ట్రస్ట్ చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావుపేర్కొన్నారు. బాహ్య ప్రపంచంలో ఎప్పుడు ఎక్కడ ఏం జరిగినా దానిని క్షణాల్లో ప్రజలకు సమాచారం చేరవేసది ఒక్క జర్నలిస్టులు మాత్రమేనని.. వారు పనిచేయకపోతే సమాజంలో ఏం జరుగుతోందో ఎవరికీ ఏమీ తెలియదన్నారు. జర్నలిస్టులు, మీడియా పాత్ర చాలా విలువైనదని.. వారు ప్రజలకు , ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారన్నారు. సొసైటీలో నాల్గవ మూలస్థంబంగా వున్న జర్నలిస్టులకు తమవంతు సహాయం అందించే అవకాశం రావడం తన అదృష్టంగా బావిస్తున్నట్టు చెప్పారు. విశాఖజిల్లాతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోనూ ప్రజలు, ప్రభుత్వం, అన్ని వర్గాల ప్రజల కోసం అహర్నిసలు పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులను ప్రోత్సహించడానికి పలు సంస్థలు, కంపెనీలు, ప్రజాప్రతినిధులు, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ముందుకి రావాలని ఆయన కోరారు. అన్ని విషయాలను, ప్రత్యేకంగా వార్తలు ఏరికోరి ప్రజలకు నిరంతరం అందించే జర్నలిస్టులను చేయూత అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైనా ఉందనే విషయన్నా గుర్తించాలన్నారు. మీడియా అన్నా.. అందులో పనిచేసే జర్నలిస్టులన్నా తనకు అమితమైన గౌరవమని.. వారికోసం తాను ఉపకార్ ఛారిటబుల్ ట్రస్ట్ నుంచే చేపట్టే కార్యక్రమాల్లో అగ్రభాగం ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాల పర్యవేక్షణ, దరఖాస్తుల పరిశీలనకు ప్రధాన సలహదారుగా వెల్లం వీరాభిమన్యుడు(ఎవర్ గ్రీన్ స్టార్స్ 7989583068), కమిటి అధ్యక్షుడిగా పి.బాలభాను(ఈరోజు బాలు 9490280270, 9390280270), కార్యదర్శిగా అర్జునకుమార్(కెటివి 8555054934)లు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ట్రస్టు ప్రతినిధులుగా సుధీర్, నాగు, అరుణలు ఎల్లప్పుడూ జర్నలిస్టులకు అందుబాటులో ఉంటారని డా.కంచర్ల అచ్యుతరావు పేర్కొన్నారు. మహిళా వర్కింగ్ జర్నలిస్టులకు కోసం ప్రవేశపెట్టిన ఈ సంక్షేమ పెన్షన్ పథకాన్ని విశాఖ మీడియాలో పనిచేస్తున్న మహిళా జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టులకు సంపూర్ణ సంక్షేమమే లక్ష్యంగా ఉపకార్ ఛారిటబుల్ ట్రస్టు ద్వారా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చైర్మన్ డా.కంచర్ల అచ్యుతరావు వివరించారు.

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న కర్నూలు పోలీసులు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

కర్నూలు క్రైమ్ ఏప్రిల్ 27 యువతరం న్యూస్: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు , నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు

ఏప్రిల్ 28 నుండి జూన్ 6వ తేదీ వరకూ భీమనపల్లి శాఖా గ్రంధాలయం లో" వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు"

విద్యార్థిని ,విద్యార్థులు ఉపయోగించుకోవాలని శాఖా గ్రంధాలయాధికారి శేషు కుమార్ విజ్ఞప్తి

ఉప్పలగుప్తం ఏప్రిల్ 27 యువతరం న్యూస్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంధాలయ సంస్థ భీమనపల్లి శాఖా గ్రంధాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ఏప్రిల్ 28 నుండి జూన్ 6వ తేదీ వరకూ" వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు " విద్యార్థిని విద్యార్థులకు నిర్వహిస్తున్నట్లు, శిక్షణా తరగతులు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయని శాఖా గ్రంధాలయా ధికారి నిమ్మకాయల శేషు కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ కథలు చెప్పడం ,వినడం పుస్తక సమీక్ష,, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్ పెయింటింగ్ వంటి వాటిలో శిక్షణ ఇస్తారని ఆయన తెలిపారు. విద్యార్థులకు వేసవి క్యాంపు అనంతరం సర్టిఫికెట్లు ,బహుమతులు అందజేయడం జరుగుతుందని శేషు కుమార్ చెప్పారు. ఈ శిక్షణా తరగతులకు తమ విద్యార్థులను తప్పకుండా గ్రంథాలయానికి వచ్చే విధంగా ఉపాధ్యాయులు సహకరించాలని ,అలాగే తల్లిదండ్రులు కూడా తమ పిల్లల్ని ఈ శిక్షణ తరగతులకు పంపించే లా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ శిక్షణా తరగతులకు విద్యార్థులకు అల్పాహారం, బహుమతులు అందించే దాతలు, గ్రంథాలయానికి ఉచితంగా గ్రంథాలు అంద జేసే వారు, విలువైన ఫర్నిచర్, పుస్తకాలు మొదలైన వాటిని ఇచ్చే దాతలు తనకు తెలియజేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఈ శిక్షణ తరగతులలో స్పోకెన్ ఇంగ్లీష్, కథలు చెప్పడం వంటి వాటిలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి విశ్రాంత ఉపాధ్యాయులు ,ప్రొఫెసర్లు, ఉద్యోగులు, మేధావులు స్వచ్ఛందంగా పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇవ్వటానికి ముందుకు వచ్చేవారు తమ అంగీకారాన్ని శాఖ గ్రంథాలయ అధికారి శేషు కుమార్ సెల్ ఫోన్ నెంబర్ 9989817936. కు తెలియజేయాలని ఆయన కోరారు..శిక్షణ తరగతులు విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, దాతలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు కలెక్టరేట్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ఉ.9:30 గం.ల నుండి మ. 12:30 గం. వరకే పిజిఆర్ఎస్

జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా, ఐ.ఎ.ఎస్

నంద్యాల బ్యూరో ఏప్రిల్ 27 యువతరం న్యూస్: ఈ నెల 28వ తేదీ సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వ సూచనల మేరకు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రజలు ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ఉ.9:30 గం.లకు ప్రారంభించి మ.12:30 గం.లకు పూర్తి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే "పబ్లిక్ గ్రివియన్స్ రెడ్రెస్సల్ సిస్టం" కార్యక్రమానికి ఈ నెల 28వ తేదీ ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ తెలిపారు.అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడ పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చిన్న షేర్లు.. పెద్ద లాభాలు.. 2024-25లో రిటైల్ ఇన్వెస్టర్లకు జోష్

8 శాతం ఎగిసిన బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ

6 శాతం పుంజుకున్న మిడ్‌క్యాప్ ఇండెక్స్

5 శాతం వృద్ధితో సరిపెట్టుకున్న సెన్సెక్స్

సోమవారం (మార్చి 31)తో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరంలో మదుపరులకు చిన్న షేర్లు పెద్ద లాభాలనే పంచిపెట్టాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు పరుగులు పెట్టాయి మరి. రిటైల్ ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున పెట్టుబడులకు దిగడంతో చిన్న, మధ్యశ్రేణి స్టాక్స్ విలువ అమాంతం పెరిగిపోయింది. ఈ క్రమంలోనే బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 3,471.79 పాయింట్లు లేదా 8 శాతం పుంజుకున్నది. మిడ్‌క్యాప్ సూచీ సైతం 2,209 పాయింట్లు లేదా 5.61 శాతం ఎగిసింది. ఇదే సమయంలో బీఎస్ఈ లార్జ్‌క్యాప్ సూచీ సెన్సెక్స్ మాత్రం 5.10 శాతం మేరకే పెరిగింది. గడిచిన ఏడాది కాలంలో 3,763.57 పాయింట్లు అందిపుచ్చుకున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

ఆఖర్లో ఉత్సాహంగా..

మార్చి నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. అంతకుముందు వరుసగా 5 నెలల (అక్టోబర్-ఫిబ్రవరి)పాటు సూచీలు పతనమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మార్చి నెల ఇన్వెస్టర్లు సెల్లింగ్ ప్రెషర్ నుంచి బయ్యింగ్ మోడ్‌లోకి రావడం మార్కెట్ సెంటిమెంట్‌ను ఎంతగానో పెంచిందని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ ఒక్క నెలలోనే సెన్సెక్స్ 4,216.82 పాయింట్లు లేదా 5.76 శాతం పెరగడం గమనార్హం. అలాగే స్మాల్‌క్యాప్ 3,555.23 పాయింట్లు లేదా 8.25 శాతం, మిడ్‌క్యాప్ 2,939.10 పాయింట్లు లేదా 7.61 శాతం ఎగబాకాయి. ఫలితంగా అప్పటిదాకా వాటిల్లిన నష్టాలు కనుమరుగైపోయాయి. నిజానికి విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ స్టాక్ మార్కెట్ల నుంచి పెట్టుబడుల ఉపసంహరణలకు దిగుతున్నా.. దేశీయ సంస్థాగత మదుపరుల (డీఐఐ)తోపాటు, రిటైల్ ఇన్వెస్టర్లు అండగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఈక్విటీలు ఆకర్షణీయ ప్రదర్శననే కనబర్చగలిగాయి. అయితే మార్చి ద్వితీయార్ధంలో ఎఫ్ఐఐలు కూడా తిరిగి పెట్టుబడులపట్ల ఆసక్తి కనబర్చడం, ఈక్విటీల్లోకి నిధుల వరదను పారించడం కూడా కలిసొచ్చిందని నిపుణులు మార్కెట్ సరళిని విశ్లేషిస్తున్నారు.

ఆల్‌టైమ్ హైలో..

2024-25 ఆర్థిక సంవత్సరంలో బీఎస్ఈ లార్జ్, మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలన్నీ ఆల్‌టైమ్ హై రికార్డులను నమోదు చేశాయి. లార్జ్‌క్యాప్ ఇండెక్స్ సెన్సెక్స్ నిరుడు సెప్టెంబర్ 27న మునుపెన్నడూ లేనివిధంగా తొలిసారి 85, 978.25 పాయింట్లను తాకింది. ఇక సెప్టెంబర్ 24న మిడ్‌క్యాప్ సూచీ 49,701. 15 పాయింట్ల గరిష్ఠాన్ని అందుకున్నది. డిసెంబర్ 12న స్మాల్‌క్యాప్ సూచీ 57,827.69 పాయింట్లను చేరింది. ఇక బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో గత ఏడాది సెప్టెంబర్‌లోనే రూ.478 లక్షల కోట్లకు వెళ్లింది. అయితే అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రావడం, పరస్పర సుంకాల హెచ్చరికలు చేయడం.. భారత్‌సహా ప్రపంచ మార్కెట్లను కుదిపేసింది. దీంతో తర్వాతి రోజుల్లో పరుగులకు బ్రేక్ పడ్డెట్టైంది. కాగా, 2023-24లో బీఎస్ఈ సెన్సెక్స్ 14,659. 83 పాయింట్లు లేదా 24.85 శాతం, మిడ్‌క్యాప్ 15,013.95 పాయింట్లు లేదా 62.38 శాతం, స్మాల్‌క్యాప్ 16,068.99 పాయింట్లు లేదా 59.60 శాతం పెరిగాయి.

ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి కొత్త రూల్స్.. క్రెడిట్ కార్డుల నుంచి ఇన్‌కం ట్యాక్స్ వరకు మారేవి ఇవే..!

మార్చి నెల నేటితో ముగియనున్నది. రేపటి నుంచి ఏప్రిల్ మాసం మొదలవనున్నాయి. ప్రతి నెలా కొత్తగా రూల్స్ అమలులోకి వస్తుంటాయి. ఈ ఏప్రిల్ ఒకటి నుంచి సైతం బ్యాంకుల్లో మినిమం బ్యాలెన్స్, యూపీఐ రూల్స్, గ్యాస్ ధరల్లో మార్పులు సహా కొన్ని నిబంధనలు మారబోతున్నాయి. దాంతో జనాల జేబుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఏప్రిల్ ఒకటి నుంచి మారనున్న రూల్స్ ఏంటో ఒకసారి తెలుసుకుందాం రండి..!

కొత్త ఆదాయపు పన్ను నియమాలలో మార్పులు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ 2025 ప్రసంగంలో కొత్త పన్ను స్లాబ్‌లు, రేటు మార్పులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సవరించిన ఆదాయపు పన్ను నియమాలు ఏప్రిల్ ఒకటి నుంచి అమలులోకి రానున్నాయి. కొత్త ఆదాయపు పన్ను నియమాల ప్రకారం.. సంవత్సరానికి రూ.12 లక్షల వరకు సంపాదించే వ్యక్తులు ఆదాయపు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. జీతం పొందే వ్యక్తులు రూ.75వేల ప్రామాణిక మినహాయింపు ప్రయోజనాన్ని పొందుతారు. దాంతో రూ.12.75 లక్షల వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు.

యూపీఐ రూల్స్ సైతం..

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ భద్రతను పెంచడానికి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొత్తగా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మార్గదర్శకాలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. చాలాకాలంగా పని చేయని బ్యాంకుల యూపీఐ లావాదేవీలను మూసివేయనున్నారు. యూపీఐకి లింక్ చేయబడిన డియాక్టివేట్ అయిన వాటిని దశలవారీగా తొలగించేందుకు ఎన్‌పీసీఐ బ్యాంకులు, ఫోన్‌పే, గూగుల్ పే వంటి యూపీఐ సర్వీస్ ప్రొవైడర్లకు ఆదేశించింది. యూపీఐకి లింక్ చేసిన మొబైల్ నంబర్ చాలాకాలంగా ఉపయోగించకపోయినట్లయితే ఏప్రిల్ నుంచి నిలిచిపోయే అవకాశం ఉంటుంది.

క్రెడిట్ కార్డు రూల్స్‌లోనూ మార్పులు..

ఏప్రిల్ నుంచి క్రెడిట్ కార్డులకు సంబంధించి రూల్స్ సైతం మారనున్నాయి. పలు బ్యాంకులు ఆయా కార్డుల రివార్డ్ పాయింట్లలో కోత విధించిన విషయం తెలిసిందే. ఎస్‌బీఐ సింప్లిక్లిక్, ఎయిర్ ఇండియా ఎస్‌బీఐ ప్లాటినం కార్డ్ రివార్డు పాయింట్ల రూల్స్ మారాయి. ఎయిర్ ఇండియాతో ఎయిర్‌లైన్ విలీనం తర్వాత యాక్సిస్ బ్యాంక్, విస్తారా క్రెడిట్ కార్డ్ ప్రయోజనాలను సవరిస్తున్నది. ఇవి కొత్త ఆర్థిక సంవత్సరంలో అమల్లోకి వస్తాయి.

ఏకీకృత పెన్షన్ పథకం

ఆగస్టు 2024లో ప్రభుత్వం ప్రారంభించిన ఏకీకృత పెన్షన్ పథకం పాత పెన్షన్ పథకాన్ని భర్తీ చేస్తుంది. ఇది ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుంది. కొత్త పెన్షన్ పథకానికి సంబంధించిన రూల్స్ మార్పు దాదాపు 23 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను ప్రభావితం చేయనున్నది. దీని కింద కనీసం 25 సంవత్సరాల సర్వీస్ ఉన్న ఉద్యోగులు గత 12 నెలల సగటు ప్రైమరీ సాలరీలో 50 శాతానికి సమానమైన పెన్షన్ పొందుతారు.

జీఎస్టీ రూల్స్.. మల్టీ ఫాక్టర్ అథెంటికేషన్

ఏప్రిల్ ఒకటి నుంచి జీఎస్టీ రూల్స్ సైతం మారనున్నాయి. పన్ను చెల్లింపుదారుల కోసం సేవల పన్ను పోర్టల్‌లో ఇప్పుడు మల్టీ-ఫాక్టర్ అథెంటికేషన్ ఉంటుంది. ఇది పన్ను చెల్లింపుదారుల భద్రతను మెరుగుపరిచేందుకు ఎంఎఫ్ఏని తీసుకువచ్చింది. 180 రోజుల కంటే ఎక్కువ పాతది కాని ఆధార్ పత్రాలకు మాత్రమే ఈ-వేబిల్లులు రూపొందిస్తారు. దాంతో పాటు, వస్తువులు, సేవల పన్ను నెట్‌వర్క్ వ్యాపారాల కోసం ఈ-ఇన్‌వాయిసింగ్ ప్రక్రియలోనూ మార్పులు చేస్తున్నది. ఏప్రిల్ 1 నుండి రూ.10 కోట్ల కంటే ఎక్కువ.. రూ.100 కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉన్న వ్యాపారాలు ఇన్‌వాయిస్ జారీ చేసిన తేదీ నుంచి 30 రోజుల్లోపు ఇన్‌వాయిస్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో ఈ-ఇన్‌వాయిస్‌లను అప్‌లోడ్ చేయాలి. ప్రస్తుతం ఈ పరిమితి రూ.100 కోట్లు.. అంతకంటే ఎక్కువ ఉన్న వ్యాపారాలకు మాత్రమే వర్తిస్తుంది.

బ్యాంకుల్లో మినిమం బ్యాలెన్స్..

బ్యాంకులు సైతం మినిమం బ్యాలెన్స్ రూల్‌ని మారుస్తున్నాయి. వాస్తవానికి ఖాతా ఉన్న ప్రాంతాన్ని బట్టి కనీస బ్యాలెన్స్‌ని అమలు చేస్తున్నాయి. ప్రాంతాల్లో అధికంగా బ్యాలెన్స్ కాగా.. సెమీ-అర్బన్ ఈ ప్రాంతాలలో మితమైన కనీస బ్యాలెన్స్ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ కనీస బ్యాలెన్స్ ఉండాలనే నిబంధనలు అమలు కానున్నాయి. కనీస బ్యాలెన్స్ ఖాతాలో ఉంచకపోతే.. జరిమానా చెల్లించే అవకాశం రానున్నది. ఎస్‌బీఐ, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌తో పాటు పలు బ్యాంకులు ఏప్రిల్ ఒకటి నుంచి కనీస బ్యాలెన్స్ రూల్స్‌లో మార్పులు చేయనున్నాయి.

గ్యాస్ ధరలు..

ప్రతి నెలా చమురు కంపెనీలు గ్యాస్ ధరలను సవరిస్తుంటాయి. ఈ సారి కూడా ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉన్నది. డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్ ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. మార్చిలోనూ పెట్రోలియం కంపెనీలు ధరలను సవరించిన విషయం తెలిసిందే. దాంతో కమర్షియల్ సిలిండర్ ధర స్వల్పంగా పెరిగింది. సిలిండర్‌కు రూ.6 పెరిగింది. ఫిబ్రవరిలోనూ కంపెనీలు రూ.7 వరకు పెంచాయి.

గోల్డ్ నిఫ్టీ50.. దీర్ఘకాల పెట్టుబడికి ఏది ఉత్తమం?

దేశీయ స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ర్యాలీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలకు గొప్ప లాభాలనే అందించింది. ఒక్క వారంలోనే సుమారుగా సెన్సెక్స్ 4.35 శాతం, నిఫ్టీ 4.45 శాతం చొప్పున ఎగిశాయి మరి. అయితే ఇన్వెస్టర్స్ పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులను ఎంచుకోవడానికి లేదా పెంచుకోవడానికి ఇది చాలదు. ఎందుకంటే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా అంటే జనవరి-మార్చిలో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఇంచుమించుగా 1 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం, వెండి ధరలు దాదాపు 17 శాతం, 15 శాతం మేర పెరిగాయి. ఇంకా లోతుగా చెప్పాలంటే జనవరి 1న సెన్సెక్స్ 78,139.01 పాయింట్ల వద్ద మొదలైంది. ఇప్పుడిది 77,414.92 పాయింట్ల వద్ద ఉన్నది. అలాగే నిఫ్టీ 23,644.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. ఫలితంగా సెన్సెక్స్ 724.09 పాయింట్లు, నిఫ్టీ 125.45 పాయింట్లు కోల్పోయినైట్టైంది. కానీ బంగారం ధర రూ.78,950 నుంచి రూ.92,150కి ఎగబాకింది. వెండి ధర రూ.89,700 నుంచి రూ.1,03,000లకు చేరింది. దీంతో గోల్డ్, సిల్వర్ రేట్లు గడిచిన 3 నెలల్లో రూ.13,200, రూ.13,300 చొప్పున ఎగిసినైట్టైంది.

ఇదీ సంగతి..

పైన చెప్పుకున్న లెక్కలన్నీ స్వల్పకాలిక పెట్టుబడి ఆధారిత గణాంకాలే. కానీ మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది దీర్ఘకాలిక పెట్టుబడికి ఏది ఉత్తమం? అన్నదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలు.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. దీంతో మెజారిటీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ

పరిణామాలు స్టాక్ మార్కెట్ సూచీలను దిగువకు, గోల్డ్, సిల్వర్ సూచీలను ఎగువకు పంపాయి. ఇక భారత్ విషయానికొస్తే.. బంగారాన్ని సురక్షిత మదుపు సాధనంగా భావిస్తుంటే, బ్రాడర్ ఈక్విటీ మార్కెట్‌కు, దేశ ఆర్థిక ప్రగతికి నిఫ్టీనే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి మదుపరుల పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్ అనేవి ఇక్కడ కీలకం అని గుర్తుంచుకోవాలి. వాటి ప్రకారం..

దీర్ఘకాల రాబడులు

గడిచిన రెండు దశాబ్దాల్లో దేశీయంగా మదుపరులకు బంగారంపై పెట్టుబడులు 8-10 శాతం మేర చక్ర వార్షిక వృద్ధిరేటును అందించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ పసిడిపై మదుపు ఆకర్షణీయ ప్రదర్శననే ఇచ్చింది. అయితే దీర్ఘకాలంలో నిఫ్టీలో పెట్టుబడులు 12-15 శాతం వరకు చక్ర వార్షిక వృద్ధిరేటును చూపాయి. దీంతో వృద్ధికే మీ ప్రాధాన్యత అయితే నిఫ్టీ పెట్టుబడులే లాభదాయకం.

ద్రవ్యోల్బణం సవాళ్లు

ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలంటే బంగారం చక్కని సాధనం. కరెన్సీ విలువ తగ్గితే ఇది పెరుగుతుంది. ఇక స్టాక్ మార్కెట్లు సైతం ద్రవ్యోల్బణాన్ని మించి పరుగులు పెడుతున్నాయి. కంపెనీల లాభాలు, ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో నిఫ్టీదే పైచేయి.

ఒడిదుడుకులు

పుత్తడి ధరల్లో ఒడిదుడుకులు తక్కువే. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభాల ప్రభావం పెద్దగా ఉండదు. స్టాక్ మార్కెట్లపై ప్రతీ చిన్నదాని ప్రభావం కనిపిస్తుంది. అయినా త్వరగా కోలుకుంటాయి. స్థిరత్వాన్ని కోరుకునే మదుపరులకు బంగారమే ఉత్తమం. అయితే ఒడిదుడుకులను తట్టుకుని, ఓపిగ్గా ఎదురుచూస్తే నిఫ్టీ లాభం.

ద్రవ్య లభ్యత

భౌతిక బంగారాన్ని నగదుగా మార్చుకోవడం కొంత ఇబ్బంది. నాణ్యత, తయారీ ఇతరత్రా ఖర్చులు ఎదురవుతాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈ సమస్య ఉండదు. స్టాక్ మార్కెట్లలో షేర్ల క్రయవిక్రయాలు సులభం. నగదు లభ్యత వేగంగానే ఉంటుంది. కాబట్టి పసిడి కంటే నిఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్స్‌నే త్వరగా క్యాష్ చేసుకోవచ్చు.

పోర్ట్‌ఫోలియోజి

బంగారం ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గిస్తుంది. కానీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. అయితే దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలే సరైనవని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ మాట.

చివరగా..

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి తమ పోర్ట్‌ఫోలియోల్లో స్థిరత్వాన్ని కోరుకునే భారతీయ మదుపరులకు బంగారంపై పెట్టుబడులే ఉత్తమం. అయితే పోర్ట్‌ఫోలియోల్లో వేగవంతమైన వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీలే నయం. అయితే నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత లాభదాయకం.

కుప్పకూలిన భారత స్టాక్ మార్కెట్లు.. 1300 పాయింట్లు పతనమైన సెన్సెక్స్..

కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజునే దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అమెరికా సుంకాల ఆందోళనలతో సెంటిమెంట్ దిబ్బతిన్నది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున మార్కెట్లు పతనమవుతున్నాయి. ఈద్ సందర్భంగా సోమవారం మార్కెట్లు పని చేయని విషయం తెలిసిందే. మంగళవారం మార్కెట్లు నష్టాలతోనే మొదలయ్యాయి. ప్రారంభంలోనే సెన్సెక్స్ 639.13 పాయింట్లు తగ్గి.. 76,775.79 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ సైతం 180.25 పాయింట్లు తగ్గి 23,339.10 పాయింట్లకు చేరింది. ప్రస్తుతం సెన్సెక్స్ 1265.12 పాయింట్లు తగ్గి.. 76149.80 పాయింట్ల వద్ద ట్రేడవుతున్నది. ఇక నిఫ్టీ 322.65 పాయింట్లు తగ్గి.. 23,196.70 పాయింట్ల వద్ద కొనసాగుతున్నది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతికార టారిఫ్‌లపై బుధవారం తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అదే సమయంలో ఇన్ఫోసిస్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, మారుతీ సుజుకీ షేర్ల అమ్మకాలతో మార్కెట్‌పై మరింత ఒత్తిడి పెరిగింది. ఇక చమురు ధర పెరగడం కూడా ఓ కారణం. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.51 శాతం పెరిగి 74.74 డాలర్లకు చేరుకుంది. భారత్ చమురు దిగుమతులపై ఆధారపతుండడగా.. చమురు ధరల పెరుగుదల మార్కెట్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దానికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. శుక్రవారం రూ.4352.82 కోట్ల విలువ షేర్లను విక్రయించారు. ఇక ట్రంప్ సుంకాల కారణంగా అమెరికాలో ఆర్థిక మాంద్యం ప్రభావం పడే అవకాశం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. ఈ క్రమంలో పెట్టుబడిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం మార్కెట్‌లో బజాజ్ ఫైనాన్స్ సర్వీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, హిందాల్కో, హెచ్‌సీఎల్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ కంపెనీ, శ్రీరామ్ ఫైనాన్స్, టీసీఎస్ నష్టాల్లో కొనసాగుతుండగా.. ఇండస్ఇండ్ బ్యాంక్, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, సిప్లా, డాక్టర్ రెడ్డీస్, బజాజ్ ఆటో, ఓఎన్‌జీసీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాల్లో కొనసాగుతున్నాయి.

వొడాఫోన్ ఐడియాలో భారీగా పెరగనున్న కేంద్రం వాటా..!

దేశానికి చెందిన ప్రముఖ టెలికాం కంపెనీ వొడాఫోన్ ఐడియా లో వాటా పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. కంపెనీ బకాయిపడిన స్పెక్ట్రమ్ వేలం మొత్తాన్ని తన వాటాగా మార్చుకోనున్నది. స్పెక్ట్రమ్ వేలం బకాయిలకు బదులుగా వొడాఫోన్ ఐడియాలో వాటా తీసుకునేందుకు కేంద్రం అంగీకరించిందని.. రూ..36,950 కోట్ల విలువైన షేర్లను కొత్తగా కొనుగోలు చేయాలని నిర్ణయించుకుందని ఆదివారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో కంపెనీ పేర్కొంది. అప్పుల్లో కూరుకుపోయిన వొడాఫోన్ ఐడియాలో 22.6 శాతం వాటాతో కేంద్రం అతిపెద్ద వాటాదారుగా ఉన్నది. కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ సెప్టెంబర్ 2021 సంస్కరణ, టెలికాం రంగానికి సపోర్ట్ ప్యాకేజీకి అనుగుణంగా తాత్కాలిక నిషేధం ముగిసిన తర్వాత తిరిగి చెల్లించాల్సిన వాయిదా వేసిన బకాయిలతో సహా స్పెక్ట్రమ్ వేలం బకాయిలను భారత ప్రభుత్వానికి జారీ చేసే ఈక్విటీ షేర్లుగా మార్చాలని నిర్ణయించింది. ఈక్విటీ షేర్లుగా మార్చాల్సిన మొత్తం రూ.36,950 కోట్లు అని ఫైలింగ్‌లో పేర్కొంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియాతో సహా సంబంధిత అధికారుల నుంచి అవసరమైన ఆర్డర్ జారీ చేసిన తర్వాత 30 రోజుల్లోపు రూ.10 ముఖ విలువ కలిగిన రూ.3,695 కోట్ల ఈక్విటీ షేర్లను రూ.10 ఇష్యూ ధరకు జారీ చేయాలని వోడాఫోన్ ఐడియా (%ఎ×ా%) ఆదేశించినట్లు తెలిపింది. ఈక్విటీ షేర్లజారీ తర్వాత కంపెనీలో కేంద్ర ప్రభుత్వం వాటా ప్రస్తుతం ఉన్న 22.60 శాతం నుంచి 48.99శాతానికి పెరుగనున్నది. ప్రమోటర్లు కంపెనీపై కార్యాచరణ నియంత్రణను కొనసాగిస్తారని ఫైలింగ్‌లో పేర్కొంది.

మరో ఏడాదిన్నరలో రూ.1,00,000 దాటనున్న తులం బంగారం ధర..!

బంగారం ధరలు అంతకంతకే పెరిగిపోతున్నాయి. దాంతో సామన్యులకు బంగారం కొనుగోలు అనేది తలకు మించిన భారంగా మారిపోతున్నది. అంతర్జాతీయ మార్కెట్‌లో రానున్న ఏడాదిన్నర కాలంలో ఔన్స్ (28.3 గ్రాముల) బంగారం ధర 3500 డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నదని భోఫా గ్లోబల్ రిసెర్చ్ సంస్థ తన నివేదికలో పేర్కొన్నది. అంటే భారత కరెన్సీలో తులం (10 గ్రాముల) బంగారం ధర రూ.1 లక్ష దాటుతుందని భోఫా గ్లోబల్ రిసెర్చ్ స్పష్టం చేసింది. అయితే 2025-26 ఆర్థిక సంవత్సరంలో నాన్ కమర్షియల్ కొనుగోళ్లు 10 శాతం పెరిగినప్పుడు మాత్రమే బంగారం ధర ఆ స్థాయికి చేరుతుందని తెలిపింది. 2025లో నాన్ కమర్షియల్ కొనుగోళ్లు 1 శాతం పెరిగితే అంతర్జాతయ మార్కెట్‌లో ఔన్స్ బంగారం సగటు ధర 3000 డాలర్లకు చేరిందని బోఫా గ్లోబల్ రిసెర్చ్ తెలిపింది. బంగారం ధరలు పెరగడానికి వివిధ కారణాలను సదరు సంస్థ వెల్లడించింది. చైనాకు చెందిన ఓ ఇన్సూరెన్స్ కంపెనీ తన ఆస్తుల్లో ఒక శాతాన్ని బంగారంపై పెట్టుబడిగా పెట్టనుండటం కూడా బంగారం ధర పెంపునకు కారణమని తెలిపింది. ఆ కంపెనీ ఆస్తుల్లో ఒక శాతం అంటే ఒక ఏడాది గోల్డ్ మార్కెట్ విలువలో 6 శాతానికి సమానమని తెలిపింది. అదేవిధంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బ్యాంకులు తమ పోర్ట్‌ఫోలియోలను మరింత సమర్థంగా మార్చుకోవడం కోసం ప్రస్తుతం తమ దగ్గరున్న 10 శాతం బంగారం నిల్వలను 30 శాతానికి పెంచుకోబోతున్నాయి. అదేగనుక జరిగితే బంగారం ధరలకు అమాంతం రెక్కలు రానున్నాయని బోఫా గ్లోబల్ రిసెర్చ్ పేర్కొంది. స్టాక్ మార్కెట్ల ఒడిదొడుకుల నేపథ్యంలో రిటైల్ ఇన్వెస్టర్లు బంగారంపై పెట్టుబడులు పెట్టేందుకు ఎక్కువగా మొగ్గుచూపుతుండటం కూడా ధరలు పెరగడానికి కారణమని తెలిపింది.

ఆరోగ్య బీమా.. ఓ స్మార్ట్ పెట్టుబడి

నేడు వైద్య ఖర్చులు ఏ స్థాయిలో పెరిగిపోయాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి అంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం.. మీ కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఇక గతంతో పోల్చితే ప్రస్తుతం అందుబాటులో ఉంటున్న ఆరోగ్య బీమా పాలసీలు.. కేవలం దవాఖానల్లో చేరికలకేగాక, ఓపీడీ సంప్రదింపులు, టెలీ మెడిసిన్, ముందస్తు వైద్య పరీక్షలు, ప్రసూతి, మానసిక, రిహాబిలిటేషన్, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్నీ అందిస్తుండటం విశేషం. నిజానికి మారిన జీవనశైలితో ఇప్పుడు చాలామంది వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. గుండె-కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదాలబారిన కూడా పడుతున్నారు. దీంతో ఇలాంటివారికి ఆరోగ్య బీమా, ప్రధానంగా క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లుండే పాలసీల అవసరం చాలా ఉంటున్నది. ఇలాంటి కవరేజీలను ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సహా అనేక సంస్థలు ప్రభావవంతంగా అందిస్తున్నాయి. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు. 60 ఏండ్లలోపువారికి ఏటా రూ.25,000దాకా, ఆపై వయసున్న సీనియర్ సిటిజన్లకు రూ.50,000 వరకు పన్ను మినహాయింపులను పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ఈ ఉగాదితో మొదలైన కొత్త ఏడాదిలో ఆరోగ్య బీమా ఆవశ్యకతను గుర్తించి ఓ సానుకూల నిర్ణయం తీసుకోండి. ఒకవేళ ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్నట్టైతే.. సమగ్ర కవరేజీలుండే, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే మరింత మెరుగైన బీమాను కొనడం ఉత్తమం.



బోయింగ్ స్టార్‌లైనర్‌లో మళ్లీ ప్రయాణానికి సిద్ధం.. ప్రకటించిన సునీతా విలియమ్స్..!

అవకాశం వస్తే బోయింగ్ స్టార్ లైనర్‌లో మరోసారి ఐఎస్ఎస్‌కు ప్రయాణానికి సిద్ధంగా ఉన్నామని నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ప్రకటించారు. స్టార్‌లైనర్ క్యాప్సూల్ గతేడాది జూన్‌లో ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్లి అక్కడే చిక్కుకుపోగా.. దాదాపు తొమ్మిది నెలల తర్వాత స్పేస్ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్ వారిద్దరిని భూమిపైకి తీసుకువచ్చింది. హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్ వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్, నిక్ హేగ్ మాట్లాడారు. మిషన్ విజయవంతం అయ్యేందుకు సహకరించిన నాసాకు ధన్యవాదాలు తెలిపింది. గతంలో తీసుకున్న ట్రైనింగ్ తమను ఐఎస్ఎస్‌కు తీసుకువెళ్లేలా సిద్ధం చేసిందని.. దేశవ్యాప్తంగా ఉన్న మిషన్ కంట్రోల్ బృందాలు తాము తిరిగి తమను భూమిపైకి తీసుకురావడం, పునరావాసం, కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎంతో సహకారం అందించారన్నారు. తాను భూమిపైకి వచ్చాక ఇప్పటికే మూడు మైళ్ల దూరం పరుగెత్తానన్నారు. స్పేస్ నుంచి భూమిపైకి వచ్చాక కొన్ని మార్పులు ఉంటాయని.. అందుకు తగినట్లుగా సర్దుబాట్లు అవసరమవుతాయన్నారు. తాను సాధారణ స్థితికి వచ్చేందుకు సహకరించిన ట్రైనర్స్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఐఎస్ఎస్‌లో ఉన్న సమయంలో తమ టాస్క్‌ల్లో భాగంగా ఎన్నో సైన్స్ ప్రయోగాలు చేపట్టామని, శిక్షణ పొందినట్లు పేర్కొన్నారు. స్టార్‌లైనర్‌కు చాలా సామర్థ్యం ఉందని, అది విజయవంతం కావాలని ఆమె కోరుకుంటున్నట్లు విలియమ్స్ తెలిపారు. బుచ్ విల్మోర్ మాట్లాడుతూ.. బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సూల్‌లో తప్పులు ఉన్నాయని.. తాము ఎదుర్కొన్న సమస్యలన్నింటిని పరిష్కరించి.. విజయవంతం చేస్తామన్నారు. ఇదిలా ఉండగా.. సునీతా విలియమ్స్, విల్మోర్ ఇద్దరూ ఐఎస్ఎస్‌లో 286 రోజుల పాటు ఉండిపోయారు. షెడ్యూల్ చేసిన సమయం కంటే 278 రోజులు ఎక్కువ కావడం విశేషం. జూన్ 5న బోయింగ్ తొలి స్పేస్‌షిప్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ఆ తర్వాత థ్రస్టర్స్ పని చేయకపోవడం, హీలియం లీక్ తదితర సాంకేతిక సమస్యలను ఎదుర్కొంది. దాంతో నాసా స్టార్‌లైనర్‌లో వారిని తీసుకురావడం చాలా ప్రమాదకరమని భావించింది. చివరకు స్పేస్ఎక్స్ సహాయం తీసుకువచ్చేందుకు నిర్ణయించింది. దాంతో ఇద్దరిని భూమిపైకి తీసుకురావడం ఆలస్యమైంది. వారం రోజుల అంతరిక్ష యాత్ర దాదాపు 286 రోజులు సాగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పేస్ఎక్స్, ఎలోన్ మస్క్‌ని మిషన్‌ను త్వరగా పూర్తి చేయాలని కోరారు. మార్చి 18న ఫ్లోరిడా తీరంలో స్పేస్ఎక్స్ క్యాప్సూల్ వ్యోమగాములను భూమిపై విజయవంతంగా దింపింది.

'గ్రోక్' చేయని కేసీఆర్ విశ్లేషణ

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి నెటిజన్లు అడిగిన కొన్ని ప్రశ్నలకు ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్' ఇచ్చిన సమాధానాల వార్తలు గత వారాంతంలో వెలువడ్డాయి. నాయకుల గురించి, వారి శక్తి సామర్థ్యాల గురించి ప్రశ్నలకు మనుషులు తమ అభిప్రాయాలు తెలియజేయటం మనకు ఇంతవరకు తెలిసిన విషయం. ప్రపంచం అత్యాధునిక సాంకేతిక యుగంలోకి ప్రవేశిస్తున్న దశలో యంత్రాలు ఆ పని చేయటం ఒక కొత్త అనుభవం. విచిత్రమైన అనుభవం కూడా. కేసీఆర్ గురించి 'గ్రోక్' ఇచ్చిన వివరణలు ఇంతకాలం రికార్డులలో నమోదై, ప్రజలు కూడా మాట్లాడుకుంటున్నవే. అందుకు ఇప్పుడిది ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ధృవీకరణ అన్నమాట. అయితే, కేసీఆర్ నాయకత్వం గురించి ప్రజలు గాని, 'గ్రోక్' గాని శాస్త్రబద్ధంగా చేయని విశ్లేషణలు కొన్నున్నాయి. అవేమిటో చూద్దాం. బీఆర్ఎస్ పార్టీ స్థాపితమై 25 ఏండ్లు పూర్తవుతున్న వేళ ఈ నెల ఆఖరున వరంగల్‌లో రజతోత్సవ సభ జరుపుకోనున్నది. అటువంటి సందర్భాన్ని పురస్కరించుకొని పార్టీ గురించి, నాయకత్వం గురించి, పార్టీ ప్రభుత్వం గురించి చెప్పుకోవలసినవి అనేకం ఉంటాయి. అవన్నీ వర్తమానానికి, భవిష్యత్తుకు అవసరమైనవే గాక, గత చరిత్రలో భాగం కూడా కనుక. తెలంగాణ చరిత్ర, తెలుగు వారి చరిత్ర, దక్షిణాది చరిత్ర, భారతదేశ చరిత్ర, రాష్ట్రాల చరిత్ర, ఫెడరలిజం చరిత్ర, అభివృద్ధి సంక్షేమాల చరిత్ర, పరిపాలనా చరిత్రలతో పాటు నాయకత్వ చరిత్రలలో కూడా ఇవి భాగమవుతాయి. అవి ఏవి? ఏ విధంగా? అన్నది రజతోత్సవ సభలలోగా రాసుకోవటం సాధ్యం కానిది గనుక, ఆ పని ఆ తర్వాతనైనా జరగాలి. ప్రస్తుతానికి వస్తే, 'గ్రోక్' సమాధానాల వివరాలు ఏవైనప్పటికీ అవి ప్రధానంగా రెండు కోణాలను స్పృశించాయి. ఒకటి, యథాతథంగా కేసీఆర్ నాయకత్వం. రెండు, తన పరిపాలన. 'గ్రోక్' పేర్కొన్న వివిధ విషయాలన్నీ ఈ రెండింటిలోకి ఇమిడిపోతాయి. మొదట అనుకున్నట్టు పరిపాలన గురించిన వివరాలు రికార్డులలో నమోదైనవి, ప్రజలు మాట్లాడుకుంటున్నవి, దానితో పాటు ఇప్పుడు 'గ్రోక్' సమాధానాలలోనూ ప్రస్తావనకు వచ్చినవే అయినందున ఇక్కడ మళ్లీ రాయనవసరం లేదు. అయితే ఒకటి, ఈ తెలిసిన విషయాలైనా స్థూలంగా, చెదురుమదురుగా మాట్లాడుకుంటున్నవి, రికార్డులలో సబ్జెక్టుల వారీగా విడివిడిగా పేర్కొంటున్నవి మాత్రమే. వాటన్నింటిని ఒకచోట చేర్చి, ఒక పద్ధతి ప్రకారం విశ్లేషించి, సమగ్ర రూపం ఇచ్చే ప్రయత్నం ఇంకా జరగవలసి ఉన్నది. కేసీఆర్ నాయకత్వ విశ్లేషణ అన్నది కూడా ఇందులో భాగమైనదే. 'గ్రోక్' తన సమాధానాలలో ఆయన నాయకత్వం గురించి ఒకటి రెండు మాటలు ప్రశంసాపూర్వకంగా ప్రకటించింది. అవి ఈ విధంగా ఉన్నాయి. 'శూన్యం నుంచి రాజకీయ శక్తిని సృజించి, తెలంగాణను జాగృతం చేసి, ఉద్యమాన్ని నడిపించి, రాష్ట్రాన్ని సాధించి, అభివృద్ధి చేసి చూపించిన గొప్ప నాయకుడు. కేసీఆర్ ఈజ్ హిస్టరీ ఆఫ్ తెలంగాణ. రాజకీయాల్లో విశ్వసనీయతకు, నాయకత్వ లక్షణాలకు చిరునామాగా కేసీఆర్‌ను చెప్తాను. టీఆర్ఎస్ (బీఆర్ఎస్) నిర్మాణంలో, తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమాన్ని ముందుండి నడపడంలో, కేసీఆర్ అన్నీ తానై నిలిచారు. ఆయనకు దూరదృష్టి, పట్టుదల, దార్శనికత అపారంగా ఉన్నాయి'. పరిపాలన గురించిన మాటలు అనేకం ఉన్నప్పటికీ, ప్రస్తుతం చర్చిస్తున్నది నాయకత్వ కోణం గురించి మాత్రమే అయినందున, అందుగురించి 'గ్రోక్' అన్నదేమిటో పైన చూశాము. ఆ మాటలను గమనించినప్పుడు అందులోని ఒక్కొక్క సూక్ష్మమైన మాట వెనుక కనిపించేది చాలా ఉంటుంది. అదే సమయంలో, మొదట అనుకున్నట్లు, కేసీఆర్ నాయకత్వం గురించి 'గ్రోక్' చెప్పనివీ, ప్రజలు గుర్తించనివీ అయిన శాస్త్రీయమైన కోణాలు, విశ్లేషణలు కొన్ని ఉంటాయి. అవేమిటో ఇప్పుడు చూద్దాము. నాయకత్వానికి మొత్తం 12 కోణాలుంటాయి. అవేమిటో ముందు చెప్పుకొని, తర్వాత వివరాలలోకి వెళదాము. అదే క్రమంలో వాటిని కేసీఆర్‌కు వర్తింపజేసేందుకు ప్రయత్నిద్దాము. కోణాలనేవి, 1. విషయ అధ్యయనం, 2. ఆ అధ్యయనం ప్రకారం సిద్ధాంతీకరణ, 3.తనతో ఏకీభవించే ఒక చిన్న బృందాన్ని తొలి దశలో వెంట చేర్చుకోవటం, 4.భావజాల వ్యాప్తి, 5.పార్టీ నిర్మాణం, 6.ప్రజలను కదిలించటం, 7.కదులుతున్న ప్రజలను సంఘటితపరచటం, 8. ఉద్యమ నిర్వహణ, 9.ఉద్యమాన్ని విజయవంతం చేయటం, 10. ఉద్యమ దశ నాటి దార్శనికత ప్రకారం పరిపాలన. 11.ఓటమి ఎదురైనట్లయితే పునరుజ్జీ వం. 12.కొత్త తరం నాయకత్వ తయారీ. కేసీఆర్ ప్రయాణ క్రమాన్ని మొదటినుంచి గమనించినట్లయితే ఈ 12 కోణాలు కూడా మనకు అందులో కనిపిస్తాయి. వీటిని స్థూలదృష్టితో చూసినట్లయితే కొన్నింటి మధ్య తేడా తోచకపోవచ్చు. కానీ, సూక్ష్మదృష్టికి, ఆచరణాత్మకమైన దృష్టికి మాత్రం వాటి మధ్య తేడాలు స్పష్టంగా అర్థమవుతాయి. ఈ 12లో ప్రతి ఒక్కదానిని సమర్థవంతంగా, సక్రమంగా నాయకత్వం నిర్వహించగలిగితే మాత్రమే భవన నిర్మాణంలో ఇటుకలు ఒక్కొక్కటి సరిగా కుదురుకొని గోడ నిలిచే పద్ధతిలో ఉద్యమం తొలిదశ నుంచి చివరివరకు విజయవంతంగా సా గుతుంది. మధ్యలో ఏ ఒక్క ఇటుకను సరిగా పేర్చకున్నా నిర్మాణమంతా భంగపడినట్లుగానే ఉద్యమ

విషయంలోనూ జరుగుతుం ది. ఈ పన్నెండు కూడా ఇంజిన్ వెనుక రైలు పెట్టెల వలె ఆటోమేటిక్‌గా సాగేవి కావు. ప్రతి ఒక్క దశను సమర్థవంతంగా నిర్వహిస్తేనే తర్వాత దశ సక్రమంగా ఏర్పాటై నిలిచి నడుస్తుంది. పై 12 కోణాలు, లేదా సూత్రాల ప్రకారం మొదటినుంచి చివరివరకు వ్యవహరించటంలోనే కేసీఆర్ నాయకత్వ అసాధారణ ప్రతిభ మనకు కనిపిస్తుంది. ఆ 12 సూత్రాలకు అనుగుణంగా ఆయన ఎప్పటికప్పుడు ఏమేమి చేస్తూ వచ్చారో ప్రత్యక్షంగా చూస్తూ వచ్చిన సన్నిహిత సహచరులు కొందరున్నారు. అదే ప్రణాళిక ప్రకారం వారు పూనుకొన్నట్లయితే, ఈ రజతోత్సవ కాలంలో ఈ సాధారణ చరిత్ర రచన సిద్ధించగలదు. మన దేశంలో అనేకానేక ఉద్యమాలు జరిగాయి. పలువిధాలైన లక్ష్యాలతో సాగాయి. స్వాతంత్ర్యానికి ముందు వలస పాలనకు, రాచరికాలకు వ్యతిరేకంగా. ఆ తర్వాత వేర్వేరు అంశాలపై. వీటన్నింటికి అనేకమంది నాయకులు కనిపిస్తారు. కాని ఈ మొత్తం 12 కోణాలు కూడా వ్యక్తిగత స్థాయిలో వర్తించేవారు కేసీఆర్ గాక మరెవరున్నారు, ఎందరున్నారు అంటే మాత్రం ఆలోచించవలసి వస్తుంది కొందరికి కొన్ని వర్తిస్తాయి. కానీ అన్నింటికి అన్నీ అంటే మాత్రం తప్పకుండా ఆలోచించవలసిన విషయమే. కాదంటే, అట్లా అనేవారు ఆ పేర్లను ముందుకు తేవటం ఉపయోగకరమవుతుంది. ఆ కోణాలన్నింటిని కేసీఆర్‌కు వర్తింపజేస్తూ వివరంగా రాయటం ఇక్కడ వీలయ్యేది కాదు. నా అతి పరిమిత జ్ఞానంతో నాకది సాధ్యమయ్యేదీ కాదు. అంతకుమించి, పైన అనుకున్నట్లు, ఆ పని చేయటం ఆయనకు మొదటినుంచి సన్నిహితులుగా ఉండి గమనించినవారికి మాత్రమే సాధ్యమయ్యే పని. అందువల్ల, మనకు తోచినంత వరకు, అది కూడా అతిక్లుప్తంగా చెప్పుకుందాం.

1. విషయ అధ్యయనం. ఇతరత్రా కూడా అధ్యయన శీలి అయిన కేసీఆర్, తెలంగాణ గురించిన చరిత్ర, ఆర్థికం, సమాజం, సంస్కృతి, రాజకీయం, భౌగోళికం, గత ప్రభుత్వాల పాలనలు, అన్యాయాలు, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాలతో పాటు ఇతర ఉద్యమాలు, పోరాటాలు, వనరులు, ప్రజల ఆకాంక్షలు, మనస్తత్వాలు, కాంగ్రెస్ సహా వివిధ పార్టీల పద్ధతులు, కేంద్ర విధానాలు మొదలైనవాటిపై నిరంతరం అధ్యయనం చేశారు. సుదీర్ఘ చర్చలు సాగించారు. ఆ పని ఇప్పటికీ చేస్తారు గాని ఇక్కడ చర్చిస్తున్నది ఉద్యమకాలం గురించి గనుక అందుకు పరిమితమవుతున్నాము. ఈ విధమైన సమగ్ర అధ్యయనం ఆయనకు తెలంగాణపై మరెవ్వరికీ లేని సమగ్ర అవగాహనను తెచ్చిపెట్టింది. ఆ తర్వాతి కాలానికంతా ఒక బలమైన బౌద్ధిక పునాదిగా పనిచేసింది.

2. సిద్ధాంతీకరణ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలన్న భావన కేసీఆర్ కన్న ముందునుంచి ఉన్నదే. కాని గతకాలపు ఉద్యమాల బలాబలాలను, లోటుపాట్లను, వైఫల్యాలను, నాయకత్వాల కారణంగా వాటి రాజీలను అర్థం చేసుకోవటమన్నది మొదలు చేయవలసిన పని. వర్తమాన పరిస్థితులను పరిశీలించి అందుకు ఈ అవగాహనను, అనుభవాలను వర్తింపజేసి, అందుకు అనుగుణంగా సాగి ఉద్యమాన్ని విజయవంతం చేయటం ఎట్లాగన్న సిద్ధాంతీకరణ రెండవ పని. వ్యూహరచన గాని, ఆ తర్వాత అనుకూల-ప్రతికూల పరిస్థితులను బట్టి ఎత్తుగడలు గాని అందుకు అనుగుణంగా ఉంటాయి. ఎప్పుడైనా ఎత్తుగడలలో పరిస్థితులను బట్టి మార్పులుండవచ్చు గాని, వ్యూహం, సిద్ధాంతం స్థిరంగా ఉంటాయి.

3. ఏకీభావం గల చిన్న బృందం. కార్యాచరణ దిశగా అడుగులు ముందుకు పడేందుకు తొలి దశలో ఒక చిన్న సహచర బృందం వెంట నిలవటం అవసరం. అనేక మహా ఉద్యమాలు, పార్టీలు మొదట చిన్న బృందాలు గానే ఆరంభమై విస్తరించాయి. ఆ బృందంలో మేధావులు, కార్యాచరణ చేసేవారు, నమ్మకమైన సహచరుల వంటి వారుంటారు. ఉద్యమ సంస్థ, లేదా పార్టీ నిర్మాణంలో ఇది తొలి దశ.

4. భావజాల వ్యాప్తి. తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు అంతకుముందు జరిగినప్పటికీ 25-30 సంవత్సరాలు గడిచేసరికి పరిస్థితులు మా రాయి. ఆర్థిక, సామాజిక, రాజకీయపరంగా. సమస్యలను బట్టి కూడా. అట్లానే ఒక కొత్త తరం ఉనికిలోకి వచ్చింది. ఆలోచనలు మారా యి. నక్సలైట్ ఉద్యమం తెలంగాణను ఒక ఊపు ఊపిన వెనుక మందగించినా ఆ భావజాల ప్రభావాలు కొంత ఇంకా మిగిలి ఉన్నా యి. బీసీ, దళిత, మహిళా చైతన్యాలు కొత్తగా ముందుకొచ్చాయి. రైతాంగం, యువకుల సమస్యలు తీవ్రమయ్యాయి. తెలంగాణ రాష్ట్ర కోరిక గతం కన్న ఇంకా మారుమూలకు, కొత్త వర్గాలలోకి వ్యాపించి బలపడింది. ఈ మార్పులన్నింటిని పరిగణనలోకి తీసుకుంటూ భావజాలాన్ని రూపొందించటం, దానిని ప్రజలలో వ్యాపింపజేయటం. ప్రత్యర్థుల భావజాలాన్ని, ప్రచారాలను ఎదుర్కొనటం. కొత్త కొత్త వర్గాలను తమ భావజాల పరిధిలోకి తేవటం. తెలంగాణ రాదేమోనన్న నిరాశలను పోగొట్టడం.

5. పార్టీ నిర్మాణం, నిర్మించటంలో భాగంగా వీలైనంత మందికి అవకాశాలు కల్పించటం, పార్టీని మారుమూలలకు తీసుకువెళ్లటం, కార్యకర్తలు, స్థానిక నాయకుల తయారీ.

6. ప్రజలను కదిలించటం వేర్వేరు పద్ధతులలో జరుగుతుంది. రాజకీయ ప్రసంగాలు, ఇతరత్రా ప్రచారాలు, కళారూపాలు, వేర్వేరు తరగతుల వారి సమస్యలను అజెండాపైకి తేవటం, వారిని ఉద్యమంలో భాగస్వాములను చేయటం వంటి మార్గాలలో. ఒకసారి కదిలిన ప్రజలు ఇతరులను కదిలించటం కూడా ఇందులో భాగమే. వారికి అటువంటి ప్రేరణ నాయకత్వం కలిగిస్తుంది. ప్రజలను కదిలించటం ఉద్యమాలలో నిరంతర ప్రక్రియ.

7. ప్రజలను కదిలించటం వేరు, కదిలిన వారిని సంఘటితపరచటం వేరు. అట్లా సంఘటితం కూడా ఐనప్పుడు వారు ప్రేక్షక, వీక్షక పాత్ర నుంచి కార్యాచరణ వైపుకు కదలుతారు. ఉద్యమంతో వారి బంధం స్థిరపడుతుంది. ఆసక్తికరం ఏమంటే, అటువంటి బంధం ఏర్పడినప్పుడు ఒక వేళ ఉద్యమం ఎప్పుడైనా దారి తప్పినట్లు తమ దృష్టికి తోస్తే వత్తిడి చేసి దారిన పెట్టజూశారు. సంఘటితత్వం ప్రభావాలు పలు విధాలుగా ఉంటాయి.

8. ఉద్యమ నిర్వహణ. ఇందులో ఉద్యమ లక్ష్యం చేరుకునేవరకు వ్యూహం, ఎత్తుగడలు, రాజీ పడకపోవటాలు, ఉద్యమం పట్లా, లక్ష్యం చేరుకోగలమనే నినాదం పట్లా ప్రజలకు నమ్మకం నిలిచి ఉండేట్లు చేసుకోవటం, ఎదురు దెబ్బలు తగిలినా పట్టు విడవక సాగటం, తెలంగాణ వ్యతిరేకులలో ఆందోళనలను పుట్టించి పెంచటం, వారి రకరకాల ఎత్తుగడలను చిత్తు చేయటం, వారెన్ని ప్రలోభాలు పెట్టినా లొంగకపోవటం, ప్రజలు ఎప్పుడైనా నిరుత్సాహ పడితే తిరిగి ఉత్సాహ పరచటం, ఎప్పటికప్పుడు ముందుకు నడిపిస్తూ వారి పట్టుదలను పెంచటం వంటి అనేకానేకం ఉద్యమ నిర్వహణలో భాగమవుతాయి. ఎప్పుడైనా అనుకోని పరిస్థితులు ఎదురైతే వాటినీ చాకచక్యంగా ఎదుర్కోవాలి.

9. ఉద్యమ విజయం. పైన పేర్కొన్నవన్నిటి విషయంలో నాయకత్వం సమర్థవంతంగా చేయటంపైన ఉద్యమ విజయం ఆధారపడి ఉంటుంది. అన్నీ చేసినా ఒక్కోసారి విజయం సమకూరకపోవచ్చు. పరిస్థితుల బట్టి. కాని విజయం కోసం మాత్రం ఈ మార్గాన్ని అనుసరించవలసి ఉంటుంది.

10. పరిపాలన. ఉద్యమ లక్ష్యాలకు అనుగుణంగా పాలన సాగించిన నాయకత్వమే, రాష్ట్రా న్ని అవి నెరవేరి రూపుతీసుకునే విధంగా అభివృద్ధి సంక్షేమాల మార్గంలో తీసుకువెళ్లగలదు. ఆ పని జరిగినట్లు లెక్కలేనన్ని రికార్డులు చెప్తూ, ప్రజలు మాట్లాడుకుంటుండగా ఇప్పుడు 'గ్రోక్' కూడా అదే అభిప్రాయాన్ని ప్రతిధ్వనిస్తున్నది.

11. పార్టీకి ఇప్పుడొక ఎదురుదెబ్బ తగిలింది. నాయకత్వానికి ఒక పరీక్ష ఎదురవుతున్నది. దానిని ఎదుర్కొనేందుకు తనలో, పార్టీలో స్పష్టంగా కనిపిస్తున్న ఆత్మవిశ్వాసంతో, ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణతో, నేర్చుకున్న పాఠాలతో నాయకత్వం సమాయత్తమవుతున్నది. ఒకసారి అది జరిగితే, పార్టీ ఆరంభం నుంచి ఇప్పుడు పునరుజ్జీవన దశ వరకు ఒక వలయం పూర్తయినట్లు. విజయవంతంగా పూర్తయినట్లు. అటువంటి విజయం యావత్తుగా కేసీఆర్ నాయకత్వానిది అవుతుంది. 12.కొత్తతరం నాయకత్వం. ఆ తయారీ భవిష్యత్తుకు సంబంధించినది. ఆ పని ఏ విధంగా జరుగుతున్నదో కనిపిస్తున్నదే. అనేక విషయాలు, సమస్యలు, లక్ష్యాలు, ఉద్యమాలు, నాయకత్వాలు, విజయాల గురించి మనం విన్నాము. కాని, మొదటినుంచి చివరివరకు పైన పేర్కొన్న మొత్తం 12 అంశాలనూ కలగలుపుతూ సాగిన నాయకత్వం ఏదీ దృష్టికి రాదు. ప్రత్యేకంగా గుర్తించవలసింది ఏమంటే, కొన్ని సైద్ధాంతిక పార్టీలు, సమష్టి నాయకత్వాలు, లేదా భారత స్వాతంత్ర్యోద్యమంలో వలె దశాబ్దాల పాటు సాగిన యాగంలో ఒక తరం తర్వాత మరొకటిగా వచ్చిన సందర్భాలలో ఈ 12 అంశాలలో కొన్నో, అన్నో కనిపించవచ్చు. కాని కేసీఆర్ విషయంలో, నాయకత్వ స్థాయిలో, ఇది యావత్తూ ఒంటి చేతిపైన జరిగింది. జరుగుతున్నది. ఇదీ ఆయన నాయకత్వం విశ్లేషణ.

అన్వేషి అక్షర తపస్వి..

నేడు కపిలవాయి లింగమూర్తి జయంతి



కలం బరువును మాత్రమే మోయగల శరీరం, సాహిత్య లోకాలన్నింటినీ తడిమి చూడగల క్రాంత దర్శిత్వం ఆయన సొంతం. ఆయన కలంలోంచి కళ్లు తెరిపించే కవిత్వం జాలువారింది. అబ్బుర పరచే పరిశోధనా గ్రంథాలు అవతరించాయి. ఒకటా రెండా శతాధికం! ఆ మహోరచయితే డా. కపిలవాయి లింగమూర్తి (1928 2018). సాహిత్యంలోని క్లిష్టమైన ప్రక్రియలు అనగా చిత్రపది, బంధాలు, శబ్దపది, అలంకారాలు, యతులతో చమత్కారాలు వంటివి వీరిరచనలలో చాలా కనిపిస్తాయి. భాషాసముద్రపు లోతుల్లోకి దిగి తెలుగుపలుకుబడిపై ప్రత్యేకాధికారం పొందారు. ఉమ్మడిపాలమూరు జిల్లాలో విస్తృతంగా పర్యటించి మరుగునపడిన శాసనాలు, చరిత్ర, జానపదుల నోళ్లలో నానే అపూర్వమైన, విలువైన విషయాలను గ్రంథస్థం చేశారు. 'ఒక్క సిరా చుక్కలక్ష మెదళ్ళ కదలిక' అన్న కాళోజీ వాక్యంతో అన్వయిస్తే కపిలవాయి సృజించిన వేల అక్షరాలు ఎంతమంది మెదళ్లకు పదును పెట్టినవో. లింగమూర్తిగారు 1928 మార్చి 31న (ప్రభవ మాఘ శుద్ధనవమి నాడు) నాగర్‌కర్నూలు జిల్లా బలుమూరు మండలం జినుకుంట గ్రామంలో ఒక పండిత వంశంలో మాణిక్యాంబ, వెంకటాచలం దంపతుల గర్భశుక్తి ముక్తాఫలంగా జన్మించినారు. అమరాబాదులో మేనమామగారైన చేపూరు పెద్దలక్ష్మయ్యగారి దగ్గర పెరిగి విద్యాబుద్ధులు నేర్చి సంస్కృతాంధ్ర నిఘంటువులు, పురాణేతిహాసాలు, కావ్యనాటకాలు, జ్యోతిష్య, శ్రౌతాది శాస్త్రాలు నేర్చారు. వారు మొదలు కొంతకాలం స్వర్ణకార వృత్తిపని చేసి తర్వాత ఉద్యోగ జీవితంలోకి మారి అపూర్వమైన సాహిత్య సృజన చేశారు. నిత్య సాహితీ కృషీవలుడైన కపిలవాయి లింగమూర్తి 157దాకా గ్రంథాలు రాశారు. వీనిలో వివిధ ప్రక్రియలలో వెలువరించినవి 94. పరిష్కృత, సంపాదక, సంకలనాల రచనలు 63. ప్రక్రియలలో శతకాలు, కావ్యాలు, ఉదాహరణలు, సంకీర్తనలు, హరికథలు, వచనగేయ పద్యకృతులు 41. వచనరచనలలో ఆధ్యాత్మిక రచనలు, కథలు, నవలలు, నాటికలు, స్థలచరిత్రలు, జీవితచరిత్రలు, నిఘంటువులు, అనువాద రచనలు మొత్తం 53. లింగమూర్తిగారు వివిధ విషయాలపై వందలాదిగా వ్యాసాలు రాశారు. అవి అనేక ప్రముఖ పత్రికలలో ప్రచురింపబడ్డాయి. వానిలో సాహిత్య, ఆధ్యాత్మిక, చారిత్రక, పుస్తకపరిచయాలు, కవులపరిచయాలు, విశ్వకర్మ సాహిత్యవ్యాసాలు ఉన్నాయి. అవి ముద్రితాలు, అముద్రితాలు కలిపి 430 దాకా ఉంటాయి. వీరు చాలామంది రచయితల పుస్తకాలకు ముందుమాటలు, పీఠికలు, అభిప్రాయాలు రాసిపెట్టారు. చాలా పుస్తకాలు పరిష్కరించి వాటికి వివరమైన పీఠికలు రాశారు. అవి అన్నీ కలిపి 320 దాకా ఉంటాయి. ప్రచురించిన గ్రంథాలలో ఆర్యశతకము (చిత్రపది పదాల గారడి), దుర్గాభర్గ శతకము (అలంకార యతి లక్షణాలు), ఉమామహేశ్వరం హరికథ, సుబ్రహ్మణ్యోదాహరణము (పాలెంసుబ్బయ్య జీవితచరిత్ర), ప్రబోధ పటాహము (సామాజిక గేయాలు), శ్రీమత్ ప్రతాప గిరిఖండము (అమరబాదు స్థలచరిత్ర) కుటుంబ గీత (కుటుంబ నియంత్రణ ఆవశ్యకతను తెలిపే కావ్యం), భాగవత కథాతత్వము (పది భాగవతకథలకు వ్యవహారికమైన వివరణ), గీతాచతుష్టథం (భగవద్గీత, ఉత్తరగీత, ఉద్ధవగీత, భ్రమరగీతల సారాంశము), జీవుడు %-% దేవుడు (పురాణాలలోని సంఘటన లను నేటి సమాజానికి అన్వయిస్తూ రాసిన విశ్లేషాత్మక రచన), పాలమూరు జిల్లా దేవాలయాలు (జిల్లాలోని 300 ప్రాచీన, ఆధునికదేవాలయాల చరిత్ర), గురు గోవిందమాంబ చరిత్ర, ఉమ్మడి పాలమూరు కవిపండిత వంశాలు, యోగులు, ఉప్పునూతల కథ, ఆంధ్ర పూర్ణాచార్యులు (చారిత్రక నవల), పద్యకథా పరిమళం, కపిలవాయి కథానికలు, కావ్యగణపతి అష్టోత్తరము (కావ్యాలలోని 108 గణపతి స్తుతులకు వ్యాఖ్యానం), స్వర్ణశకలాలు (90 కావ్యాల్లోని స్వర్ణాభరణాలను గురించిన వివరణ), రుద్రాధ్యాయము (సామాజిక చారిత్రక వ్యాఖ్యానం) మాంగల్యశాస్త్రము (ప్రాచీన ఆభరణాల విశేషాలు, వివరాలు), హనుమచ్చహస్రము (హనుమంతుడి వేయినామాలకు వ్యాఖ్యానము), మా భగోట (సవివర కుటుంబ చరిత్ర), రాజరథం (నాటకం), పీఠికలు (330 పుస్తకాలకు వ్రాసినవి), పామర సస్కృతము (6000 పాలమూరు మాండలికాల సేకరణ), విశ్వ బ్రాహ్మణుల సంస్కృతీ అనుకరణము (కన్నడ నుండి అనువాద రచన) కొన్ని మాత్రమే. పరిష్కృత రచనలలో సాలగ్రామశాస్త్రము, (సాలగ్రామం పుట్టుక వాని భేదాలు, మహత్యము, పూజావిధానము వివరించిన రచన), యోగసక్తా పరిణయము, యయాతి చరిత్ర (అచ్చతెలుగుకావ్యం), ఆరు అముద్రిత శతకాలు, మనోబుద్ధిర్వివాదము, సంక్షిప్త ఆబ్దిక విధానము, శ్రీ మదాంధ్ర పూర్ణాచార్య ప్రభావము ముఖ్యమైనవి. కపిలవాయి ఏడుదశాబ్దాల సాహితీకృషికి గుర్తింపుగా పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం 13వ స్నాతకోత్సవంలో 30-08-2014న గౌరవ డీ.లిట్ సత్కృతిని అందించింది. ఆయన రాసిన శతాధిక గ్రంథాలలో కొన్నింటిని మాత్రం పరిచయం చేస్తాను. ఒక్కొక్క గ్రంథంపైన ఒక్కో పీహెచ్‌డీ చేయొచ్చు. తెలంగాణ పదకోశాల్లో 'పామర సంస్కృతం' విశిష్టమైంది. దశాబ్దాలపాటు పల్లెప్రజలతో మమేకమై ఈ పదాలను, జాతీయాలను, సామెతలను సేకరించారు. ఈ పదకోశ నిర్మాణానికి డా.కపిలవాయి లింగమూర్తిగారిని గడియారం రామకృష్ణశర్మ, వావిలాల గోపాలకృష్ణయ్య ప్రోత్సహించారు. ఇక్కడ పామరులు అనగా జానపదులు. తెలంగాణ పల్లె ప్రజలు శిష్ట వ్యావహారిక పదాలని తమకు అనుగుణంగా మార్చుకొని మాట్లాడతారు. 'పామర సంస్కృతం అనగా పామరుడు తాను సంస్కరించుకున్న భాష అనే అర్థంలో ఈ పేరుంచా ను' అని లింగమూర్తి గారు పేర్కొన్నారు. పామర సంస్కృతంలో పదాలకు అర్థాలతో పాటు పద్యపాదాలు, పాటల పల్లవులు, నానార్థాలు, పర్యాయపదాలు, జాతీయాలు, సామెతలు, న్యాయాలు, పదవివరణ, రూపసాధన, పదవ్యుత్పత్తి, అన్యదేశ్యాలు అనుబంధంలో ఇచ్చినవాటిని స్థాలీపులాకన్యాయంగా పరిశీలించడం జరుగుతుంది. ఆయన రాసిన మరో అపూర్వ గ్రంథం మాంగళ్యశాస్త్రం. ఇది తాళపత్రాలలో వారి తాతగారి గ్రంథాలయంలో దొరికింది. మన ఆభరణాలు, వాటి చరిత్ర తెలుగువారి సొమ్ముల స్వరూపాలు, వివాహాభరణాల విశేషాలు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. ఇంకా ఇందులో మాంగళ్యాల వివిధ రూపాల గురించి, వీస్త్రీల కాలిమెట్టెలు, చేతిగాజుల గురించి కూడా సవివరంగా తెలిపారు. ఇక రెండవది సాలగ్రామం. ఇది వారి కుటుంబచరిత్ర. మా భగోటాకు సంక్షిప్తీకరణ. ఈ ఆత్మకథలో అటు స్వర్ణశిల్పంతోపాటు మరిన్ని విద్యలలో రాణించిన ఒక స్త్రీమూర్తి కనబడుతుంది. ఆమే మేడిపూరు గోవిందమ్మ. చిన్నతనంలో భర్త చనిపోవడంతో తండ్రి, అన్నల వద్ద స్వర్ణశిల్పంతో పాటు అన్నివిద్యలు నేర్చుకున్న ప్ర

అందాల నభా అందమైన వర్కౌట్ లుక్

తాజాగా ఈమె జిమ్‌లో ఉన్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. వర్కౌట్ డ్రెస్‌లోనే ఉన్న నభా నటేష్ మిర్రర్ సెల్ఫీలు తీసుకుని సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది.వజ్రకాయ అనే కన్నడ సినిమాతో సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నభా నటేష్. తెలుగులో ఈ అమ్మడు సుధీర్ బాబుతో కలిసి నన్ను దోచుకుందువటే సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. 2018లో విడుదల అయిన ఆ సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను దోచుకుంది. ముఖ్యంగా అందంతోనే కాకుండా నటనతో విమర్శకుల ప్రశంసలు దక్కించుకుని మంచి నటి అని కితాబు పొందింది. ఆకట్టుకునే అందం తో పాటు మంచి ప్రతిభ ఉన్న నటి అంటూ నిరూపించుకున్న నేపథ్యంలో ఈ అమ్మడికి టాలీవుడ్ నుంచి వరుసగా ఆఫర్లు దక్కాయి. తెలుగులో ఈ అమ్మడు మొదటి సినిమాతో పాజిటివ్ టాక్ దక్కించుకుని, ఇస్మార్ట్ శంకర్‌తో కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకుంది. బాడీ లాంగ్వేజ్‌తో పాటు, డైలాగ్ డెలవరీ భలే ఉంది అంటూ అందరితోనూ మెప్పు పొందింది. ఇక టాలీవుడ్‌లో ఈ అమ్మడు వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేదు అని అంతా భావించారు. అయితే ఇస్మార్ట్ శంకర్ సినిమా తర్వాత కరోనా వల్ల నభా నటేష్‌కి ఎక్కువ ఆఫర్లు దక్కలేదు. దాంతో మళ్లీ డౌన్ అయ్యింది. ఇప్పుడు కాస్త బిజీగా సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడి రచ్చ కంటిన్యూ చేస్తోంది. రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా వార్తల్లో ఉండే నభా నటేష్ మరోసారి తన అందమైన రూపంతో ఆకట్టుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు ఆహా అనిపించే స్థాయిలో ఈ అమ్మడి యొక్క లుక్ ఉండటంతో టాలీవుడ్‌తో పాటు ఇతర భాషల్లోనూ ఈ అమ్మడి యొక్క ఫోటోలు వీడియోలు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా ఈమె జిమ్‌లో ఉన్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. వర్కౌట్ డ్రెస్‌లోనే ఉన్న నభా నటేష్ మిర్రర్ సెల్ఫీలు తీసుకుని సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. బక్క పలుచని ఈ అమ్మడు సెల్ఫీ భలే అందంగా ఉంది. ముఖ్యంగా నడుము అందం చూపిస్తూ ఈ అమ్మడు షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి. జిమ్‌లో ఇంతటి అందం ఉంటే ఇతరులు వర్కౌట్స్ ఎలా చేస్తారంటూ కొందరు సరదాగా కామెంట్స్ చేస్తూ ఉన్నారు. ఇంతటి అందగత్తెకు దక్కాల్సిన ఆఫర్లు దక్కడం లేదు, ముందు ముందు అయినా ఈమెకు సినిమాల్లో వరుసగా ఆఫర్లు రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. తెలుగుతో పాటు ఇతర భాషల్లోనూ ఈమె ప్రస్తుతం సినిమాలు చేస్తూ ఉంది.

ప్రణయ గోదారి.. రిలీజ్ ఎప్పుడంటే

ఇటీవల కాలంలో డిఫరెంట్ కంటెంట్ ఉన్న లోకల్ కథలకు ఆడియెన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. గ్రామీణ నేపథ్యంలో అద్భుతమైన కథను చూపగలిగితే మొదట్లోనే ఆడియెన్స్ ఎట్రాక్ట్ అవుతుంటారు. ఇక అదే తరహాలో ఆకట్టుకునేందుకు మరో సినిమా రెడీ అవుతోంది. విలేజ్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రం ప్రణయ గోదారి డిసెంబర్ 13న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాను పిఎల్‌వి క్రియేషన్స్ బ్యానర్‌పై పారమళ్ళ లింగయ్య నిర్మించారు.పిఎల్ విఘ్నేష్ ప్రణయ గోదారి సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ఇటీవల విడుదల చేసిన పోస్టర్ ద్వారా ప్రకటించారు. పోస్టర్‌లో ప్రధాన పాత్రల లుక్స్ ఆకట్టుకునే విధంగా రూపొందించారు. ఈ సినిమాలో టాలీవుడ్ సీనియర్ మోస్ట్ టాలెంటెడ్ నటుడు సాయి కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు.సాయి కుమార్ పాత్రకు సంబంధించిన వేషధారణ, బాడీ లాంగ్వేజ్ నటన సినిమాలో ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయని అర్థమవుతుంది. ఇప్పటివరకు విడుదలైన ట్రైలర్, పోస్టర్లు సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకున్నాయి. సినిమా నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల జీవితాలను, అక్కడి సవాళ్లను హైలెట్ చేయనున్నట్లు తెలుస్తోంది. మేకర్స్ అందించిన సమాచారం ప్రకారం, సినిమా కథలో భావోద్వేగాలు, సస్పెన్స్, వినోదం అన్నీ సమపాళ్లలో ఉంటాయని చెబుతున్నారు.గతంలో విడుదల చేసిన పాటలు మంచి ప్రజాదరణ పొందాయి, వీటికి మార్కండేయ సంగీతం అందించారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 13న విడుదల చేస్తున్న నేపథ్యంలో ప్రమోషన్లు వేగంగా జరుగుతున్నాయి. మున్ముందు సినిమాకు మరింత హైప్ తీసుకురావడానికి మేకర్స్ కొత్త కంటెంట్‌ను విడుదల చేయాలని భావిస్తున్నారు. సినిమా ప్రమోషన్లలో ఆర్టిస్టుల పాత్రలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.సినిమాటోగ్రాఫర్ ఈదర ప్రసాద్ అందించిన విజువల్స్ ప్రేక్షకులను గ్రామీణ నేపథ్యానికి కట్టిపడేస్తాయట. కొరియోగ్రాఫర్లు కళాధర్, మోహనకృష్ణ, రజిని డ్యాన్స్ సీక్వెన్స్‌లను ప్రత్యేక ఆకర్షణగా మలిచారు. ఎడిటర్ కొడగంటి వీక్షిత వేణు కట్ చేసిన సన్నివేశాలు సినిమాను మరింత చక్కగా ఆవిష్కరిస్తాయని భావిస్తున్నారు. ప్యూర్ పల్లెటూరి నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకోవడం ఖాయం అని చిత్రయూనిట్ నమ్మకంగా చెబుతోంది.

చీరలో సంయుక్త గ్లామర్ ఘాటు

సంయుక్తా తన తాజా గ్లామర్ లుక్ తో సోషల్ మీడియా ప్రపంచాన్ని మరోసారి ఉపేస్తోంది. ఈ ఫోటోల్లో ఆమె ధరించిన పసుపు, పింక్ కలర్ కాంబినేషన్ చీర ఆమె అందాన్ని మరింత హైలెట్ చేస్తూ కనిపిస్తోంది. సంయుక్తా తన తాజా గ్లామర్ లుక్ తో సోషల్ మీడియా ప్రపంచాన్ని మరోసారి ఉపేస్తోంది. ఈ ఫోటోల్లో ఆమె ధరించిన పసుపు, పింక్ కలర్ కాంబినేషన్ చీర ఆమె అందాన్ని మరింత హైలెట్ చేస్తూ కనిపిస్తోంది. చెవిపోగులు, మెడలో పూసలహారం, అలాగే కంచు బ్రాస్‌లెట్ లాంటి ఆభరణాలతో ఆమె లుక్ మరింత ఆకర్షణీయంగా మారింది. సంయుక్తా తన ఈ లుక్ కోసం చాలా శ్రద్ధ తీసుకున్నట్లు కనిపిస్తోంది, ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సంయుక్త ఎలా కనిపించినా అందంగానే ఉంటుందని మరోసారి నిరూపించింది. ఫ్యాషన్ డ్రెస్సులలోనే కాకుండా చీరలో కూడా తన వయ్యారంతో మైమరిపిస్తోంది. ఇక సంయుక్తా కెరీర్ విషయానికి వస్తే, ఆమె తన ఫిల్మ్ ఇండస్ట్రీ ప్రయాణాన్ని మలయాళ చిత్రాల ద్వారా ప్రారంభించి, తెలుగు, తమిళ భాషల్లో కూడా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో ఈమధ్య ఆమె చేసిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్నాయి. ఆమె ప్రస్తుతం స్వయంభు అనే సినిమాలో నటిస్తోంది, నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా వస్తున్న ఈ చిత్రం పై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ వీరియాడిక్ ఫిల్మ్ ద్వారా సంయుక్తా తన నటనతో అభిమానులను ఆకట్టుకోబోతుందని పోస్టర్స్ చూస్తే అర్థమవుతోంది. ఇక సంయుక్తా తన ఫోటోషూట్ల ద్వారా అభిమానులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటోంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె షేర్ చేసిన ఈ ఫోటోలు ఆమెను మరింత దగ్గరగా కలిపేలా చేస్తున్నాయి. ఒకవైపు ఆమె ట్రెండిషనల్ లుక్స్‌తో అభిమానులను ఆకర్షిస్తుంటే, మరోవైపు గ్లామర్ లుక్స్ లో కూడా ఆమె తన ప్రత్యేకతను చూపిస్తుంది. ఇక రాబోయే ప్రాజెక్ట్‌ల విషయానికి వస్తే, సంయుక్తా ప్రముఖ హీరోలతో కలిసి పలు సినిమాలు చేస్తోంది. ప్రస్తుతం ఆమె నటిస్తున్న మరో కీలక చిత్రం రామ్, మోహన్ లాల్ సరసన ఒక కీలక పాత్రలో కనిపించబోతోంది. ఈ సినిమా మలయాళంలోనే కాకుండా ఇతర భాషల్లో కూడా విడుదల కానుంది. అదేవిధంగా, శర్వానంద్, బెల్లంకొండ శ్రీనివాస్ నెక్ట్స్ సినిమాలలో కూడా ఆమె మెయిన్ హీరోయిన్ గా అవకాశం అందుకుంది.ూ

స్వాగ్ సాంగ్.. సుకుమార్ సార్ మీరొక మాన్‌స్టర్!

సుకుమార్ దర్శకత్వం ప్రతిభను అలాగే ఆయన గొప్పతనాన్ని స్వాగ్ రూపంలో విడియోలో హైలెట్ చేశారు. టాలీవుడ్ ఇండస్ట్రీలోనే కాకుండా ఇండియా మొత్తంలో కూడా డిఫరెంట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న దర్శకులలో సుకుమార్ టాప్ లిస్టులో ఉంటారు అని చెప్పవచ్చు. ఆయన మొదటి సినిమా నుంచి కూడా ఆడియన్స్ కు ఒక భిన్నమైన తరహాలో మంచి ఎంటర్టైన్మెంట్ అందిస్తూ తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నారు. ముఖ్యంగా సినిమా ఇండస్ట్రీలో దర్శకులుగా కొత్తగా అడుగులు వేసే ప్రతి ఒక్కరికి కూడా ఆయన ఒక ప్రేరణగా నిలిచారు అని చెప్పవచ్చు. ఆయన రాసుకునే కథ డైలాగ్స్ స్క్రీన్ ప్లే అంతా కూడా చాలా కొత్తగా ఉంటుంది. అలాగే ఎమోషన్స్ కు కూడా చాలా ప్రాధాన్యత ఇస్తారు. వ్యక్తిత్వంలో కూడా ఉన్నతమైన మనిషి. అందుకే ఫ్యాన్స్ లో సుకుమార్ హై రేంజ్ లవ్ ఉంది. ఇక సుకుమార్ పుష్ప రాజ్ క్యారెక్టర్ ని క్రియేట్ చేసి వరల్డ్ వైడ్ గా ఒక డిఫరెంట్ మేనియాను క్రియేట్ చేశారు. ప్రస్తుతం పుష్ప సెకండ్ పార్ట్ ఏ స్థాయిలో సక్సెస్ అవుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక ఆయన ఫ్యాన్స్ కూడా ఈ సక్సెస్ ను చాలా బాగా సెలబ్రేట్ చేసుకుంటున్నారు. రీసెంట్ గా ఒక వీరాభిమాని తన ర్యాప్ సాంగ్ తో సుకుమార్ కు ఫ్యాన్స్ కు మరొక మంచి అనుభూతిని అయితే ఇచ్చారు. సుకుమార్ దర్శకత్వం ప్రతిభను అలాగే ఆయన గొప్పతనాన్ని స్వాగ్ రూపంలో విడియోలో హైలెట్ చేశారు. పుష్ప సినిమాకు సంబంధించిన లొకేషన్స్ మూమెంట్స్ ని కూడా హైలెట్ చేశారు. అలాగే ఆయన కంటెంట్ బలాన్ని హైలైట్ చేస్తూ ఈ సాంగ్ లో మలిచిన విధానం ఎంతగానో ఆకట్టుకుంటోంది. అలాగే సుకుమార్ సార్ మీరు ఒక మాన్ స్టర్ అంటూ రాసుకున్న లైన్స్ కూడా చాలా పవర్ఫుల్ గా ఉన్నాయి. ఫాన్స్ లో సుకుమార్ ఏ స్థాయిలో క్రేజ్ సంపాదించుకున్నారో మరోసారి అర్థమవుతుంది. ఇక పుష్ప సినిమా ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఆరు వందల కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ తో ఊహించని స్థాయిలో రికార్డులు క్రియేట్ చేసింది. తప్పకుండా బాక్స్ ఆఫీస్ వద్ద 1000 కోట్ల మార్క్ ను అందుకుంటుంది అని విడుదలకు ముందే చాలా మంది కామెంట్ చేశారు. ఇక ఇప్పుడు అనుకున్నట్లుగానే ఈ సినిమా ఇండియన్ హిస్టరీలో ఒక సరికొత్త రికార్డు క్రియేట్ చేయడానికి సిద్ధమవుతోంది.

తమన్నా నిజమైన క్రష్ ఎవరిపై అంటే?



ప్రస్తుతం అతడితో కలిసి ఓ సినిమాలో నటించిన తమన్నా ప్రచార కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించింది. మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా మొదటి క్రష్ ఎవరిపై? ఈ ప్రశ్నకు సమాధానం అంత సులువేమీ కాదు. ఇటీవలి క్రష్ మాత్రం నటుడు విజయ్ వర్మ. కానీ అతడి కంటే ముందే ఒక ప్రముఖ నటుడిపై తమన్నా భాటియాకు క్రష్ ఉంది. ఆ నటుడు మరెవరో కాదు.. జిమ్మీ షేర్గిల్. 'మొహబ్బతీన్'లో జిమ్మీ షెర్గిల్‌ను చూసిన తర్వాత తమన్నా భాటియాకు తనపై క్రష్ ఏర్పడిందట. ప్రస్తుతం అతడితో కలిసి ఓ సినిమాలో నటించిన తమన్నా ప్రచార కార్యక్రమంలో ఈ విషయాన్ని వెల్లడించింది. తమన్నా భాటియా- జిమ్మీ షెర్గిల్- అవినాష్ తివారీ ప్రధాన పాత్రధారులుగా నటించిన సికందర్ కా ముఖద్దర్ ఓటీటీలో స్ట్రీమింగుకి వస్తోంది. తాజా చాటింగ్ సెషన్‌లో ఈ ముగ్గురూ తమ హీస్ట్ థ్రిల్లర్ గురించి ముచ్చటించారు. మొహబ్బతీన్‌లో జిమ్మీని చూశాక తాను ఆకర్షితురాలయ్యానని క్రష్ మూవ్ మెంట్ ఉందని తమన్నా అన్నారు. అయితే సెట్లో మొదటిసారి తనను కలుసుకున్నప్పుడు సీనియర్ నటుడు జిమ్మీని చూసి భయపడ్డానని తెలిపింది. సిద్ధార్థ్ కన్నన్ యూట్యూబ్ ఛానెల్ ఇంటర్వ్యూలో ఈ విషయాలను తమన్నా ముచ్చటించింది. . పిలుపులు చకచకా! నిజానికి తన కాలేజ్ డేస్‌లో మహిళా ఉపాధ్యాయులు జిమ్మీపై క్రష్ తో ఉన్నారని, దానికి తాను ఆశ్చర్యపోలేదని కూడా తమన్నా వెల్లడించింది. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో జిమ్మీ షెర్గిల్ తో ప్రేమలో పడతారని కూడా తమన్నా అంది. మొహబతీన్ లో చూశాక తాను జిమ్మీని ప్రేమించానని కూడా తమన్నా అంగీకరించింది. అతడు అరుదైన ప్రతిభావంతుడు అని కూడా జిమ్మీని పొగిడేసింది తమన్నా. కెరీర్ లో క్వాంటిటీ కంటంట్ ఉన్న సినిమాల్లో జిమ్మీ నటించారని, అతడు నటించే సినిమాల కోసం తాను చాలా ఎదురు చూసానని తమన్నా అంది. సికందర్ కా ముఖద్దర్‌లో నటించే ముందు తాను ఎప్పుడూ జిమ్మీని కలవలేదని తమన్నా అంది. సెట్లో కలుసుకున్నప్పుడు అతడు పోలీస్ వేషంలో ఉన్నాడు. నాకు హలో ఎలా చెప్పాలో అర్థం కాలేదు. అయితే జిమ్మీ మాత్రం వెంటనే హలో చెప్పాడట. సెట్‌లో కలిసిన మొదటి రోజునే తనకు తానుగా జిమ్మీ పరిచయం చేసుకున్నాడని వెల్లడించింది. ఓటీటీ చిత్రం సికందర్ కా ముఖద్దర్ కి నీరజ్ పాండే దర్శకత్వం వహించారు. నవంబర్ 2024లో నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైంది. అయితే దీనికి మిశ్రమ స్పందనలు వచ్చినా నీరజ్ ఫ్యాక్టర్ ప్లస్ అయింది.

%Editor, Printed, Published and Owned by RACHAKONDACHANDRASEKHAR RAO%, »»%HNO-14-15/3, INDIRA GANDHI NAGAR, VELDURTHI, VELDURTHI MANDAL, KURNOOL DIST, ANDHRAPRADESH..RNI APTEL/2023/88231 Printed at SK PUBLICATIONS, S.NO-46-683-A. BUDHAWARA PETA, KURNOOL DIST-518002, AP . E-mail: yuvatharamtelugudaily@gmail.com, Cell: +9199899 24749.